
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 12 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు



గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	185	205
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 22.6

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు

విన్నపాల వెల్లువ

- కలెక్టరేట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అభిప్రాయసేకరణ
- హాజరైన చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్
- అభిప్రాయాలను రాతపూర్వకంగా చైర్మన్‌కు అందజేసిన కుల సంఘాలు, మేధావులు, పార్టీల విభాగాలు
- అన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించనున్న చైర్మన్



నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌కు వినతులు, సూచనలు వెల్లువెత్తాయి. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కమిషన్ చైర్మన్, జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ అభిప్రాయ సేకరణ చేపట్టారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ కులాల సంఘాలు, ఉద్యమనాయకులు, పలువురు మేధావులు వారి అభిప్రాయాలను, సూచనలను కమిషన్ చైర్మన్‌కు లిఖితపూర్వకంగా అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న కమిషన్ ఈ సూచనలు, అభిప్రాయాలు, వినతిపత్రాలను, వాస్తవిక స్థితిగతులను అధ్యయనం చేసిన అనంతరం వర్గీకరణపై సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయనుంది. దీంతో ఎస్సీ కులాలు, ఉపకులాలకు చెందిన పలు సంఘాలు, నాయకులు, వేదికల తరపున కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు సూచనలు, విన్నపాలు అందజేశారు. ● వివరాలు 6లో..

నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నెల క్రితం కిలో కూరగాయల ధరలు రూ.50లోపు ఉండగా, ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 వరకు పెరిగింది. గుడ్డు ధర రూ.5 నుంచి రూ.7కు పెరిగింది. బియ్యం క్వింటా రూ.5,500 నుంచి రూ.6,800 పెరిగింది. వీటితోపాటు వెల్లుల్లి, అల్లం, ఉల్లి, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల ధరలు గత నెలతో పోల్చితే 100 శాతం పెరిగాయి. నవంబరులో కూరగాయలపై రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఖర్చు చేస్తే, డిసెంబరు వచ్చేసరికి రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ధరాభారంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.

● ఆంధ్రజ్యోతి, కోదాడ



వంటింట్లో ధరల మంట

నెలకు రూ.10వేల వరకు అదనపు ఖర్చు

నాలుగు నెలల క్రితం నెలకు సరిపడా సరుకులకు రూ.8వేల నుంచి రూ.10వేలు ఖర్చుచేసేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి కన్పించడం లేదు. కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరగడంతో అదనంగా నెలకు రూ.5వేల నుంచి రూ.10వేలు మొత్తంగా రూ.20వేల వరకు ఖర్చు వస్తోంది. ఉద్యోగులు, రైతులు, కష్టజీవుల వేతనాలు కూరగాయల, నిత్యావసరాల ధరలు పెరిగినంతగా పెరగవు. దీంతో ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక అప్పులు చేస్తున్నాం. పెరుగుతున్న కూరగాయల, నిత్యావసరాల ధరలను ప్రభుత్వం నియంత్రించి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి.

పి.భాగ్యమ్మ, గృహిణి, కోదాడ

కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	ఆరు నెలల క్రితం (మే)	నెల క్రితం (కిలో. రూ.లో)	ప్రస్తుతం
ఆలుగడ్డ	15	30	65
దొండ	20	35	85
వంకాయ	15	45	80
దోస	22	40	80
బెండకాయ	18	20	55
మిర్చి	30	40	90
బీరకాయ	20	35	80
కాకరకాయ	35	40	80
గోరుచిక్కుడు	30	40	60
చిక్కుడు	50	80	120
క్యారెట్	25	40	60
టమాటా	14	80	20

నిత్యావసరాల ధరలు ఇలా..

సరుకులు	నెల క్రితం (కిలో రూ.లో)	ప్రస్తుతం
బియ్యం	55	68
నూనె	112	140
కొబ్బరిపొడి	200	330
పంచదార	40	55
గోధుమరవ్వ	40	55
కందిపప్పు	170	190
పెసరపప్పు	70	95
శనగపప్పు	50	70
ఉల్లిగడ్డలు	50	70
ఎల్లిపాయలు	360	450
ఇడ్లీరవ్వ	30	50
గుడ్లు (30)	150	210

- పోటీ పడుతున్న నిత్యావసరాలు
- రెండింతలైన కూరగాయల ధరలు
- అదే బాటలో గుడ్డు
- పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.90కి పెరుగుదల
- గుడ్డు రూ.7, బియ్యం క్వింటా రూ.6,800
- కూరగాయల సాగు తగ్గడం, డిమాండ్ పెరగడం, కృత్రిమ కొరత ధరల పెరుగుదలకు కారణం

ధరాభారంతో ఆదాయానికి ఖర్చుకు పొంతన ఉండటం లేదు. దీంతో నెల తిరగక ముందే అప్పు చేయాల్సి వస్తోందని పేద, మధ్యతరగతి ప్రజలు వర్గాలు వాపోతున్నారు. ధరలు పెరగడంతో నెలనెలా వచ్చే వేతనంతో కుటుంబం నెట్టుకురావడం భారంగా మారింది. కూరగాయలతోపాటు బియ్యం, ఉల్లి ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నిన్న, మొన్నటి వరకు కిలో రూ.80 ఉన్న టమాటా ధర రూ.20కి తగ్గటం కాస్త ఉపశమనం కలిగించింది.

తగ్గిన దిగుబడి, కృత్రిమ కొరత

ఉమ్మడి జిల్లాలో ఆయకట్టు ప్రాంతమైన సాగర్, మిర్యాలగూడ, హాలియా, హుజూర్‌నగర్, కోదాడ, నడిగూడెం మండలాల్లో అత్యధికంగా వరి సాగవుతోంది. నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లో కూరగాయలు, నిమ్మ, జామ, మామిడి, బత్తాయి తోటలు సాగవుతున్నాయి. నాన్‌ఆయకట్టు రైతులు సైతం బోరు బావుల కింద వరి సాగు చేపట్టడంతో కూరగాయల సాగు తగ్గింది. దీంతో దిగుబడి తగ్గడం, డిమాండ్ పెరగడం, కూరగాయల కృత్రిమ కొరత సృష్టించడంతో ధరలు పెరిగాయి. కూరగాయలతోపాటు చికెన్, మటన్, గుడ్డు ధరలు కూడా పెరగడంతో ప్రత్యామ్నాయం లేక వినియోగదారులు కూరగాయల బాటే పడుతున్నారు. గత ఏడాది మూడు ఎకరాల్లో మిగతా 7వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటి సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి సర్వేను అధికారులు వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి సూచించారు. బుధవారం అనుముల మండలంలోని మదారిగూడెం, కొత్తపల్లి, హాలియా మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు, 12వ వార్డులో ఇందిరమ్మ ఇంటి సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా పాలనలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబిత ప్రకారం పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. అర్హుల వివరాలు, వారి ఇంటి పరిస్థితిని పరిశీలించి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటికి వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు సహకరించి సంబంధిత వివరాలు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో ప్రధానంగా బీపీఎల్ పరిధిలో ఉన్న కుటుంబమై ఉండి, ఇళ్లు లేకుండా ఉండాలన్నారు. ఇంటి స్థలానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు ఉన్న వారిని ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆమె వెంట హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, మున్సిపాలిటీ మేనేజర్ రషీద్, సిబ్బంది మట్టపల్లి, వార్డు ఆఫీసర్లు, తదితరులు ఉన్నారు.

నకిరేకల్ మార్కెట్ చైర్మన్‌గా మంజుల

నూతన పాలకవర్గం నియామకం



కేతేపల్లి, డిసెంబరు 11: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం ఎట్టకేలకు ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం జీవో 882ను జారీచేసి మార్కెట్ పాలకవర్గాన్ని ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుత్తా మంజులను ప్రభుత్వం ఖరారు చేసింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక బీఆర్ఎస్ హయాంలో ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దయింది. నాటి నుంచి ఏడాదికాలం మార్కెట్‌కు పాలకవర్గం లేకుండానే గడిచింది. నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి మండలాల పరిధిలో ఏటా రూ.5కోట్లకు పైగా ఆదాయంతో పాటు రాష్ట్రంలోనే ఏకైక నిమ్మ మార్కెట్ యార్డు ఉన్న ఈ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల స్థానాలకు ప్రాధాన్యం ఏర్పడింది. చైర్మన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించగా, చైర్మన్‌తో పాటు పాలకవర్గ నియామకానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్ మండలాలకు చెందిన పార్టీ నాయకులతో చర్చించారు. ఆ తరువాత పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు రెండేళ్ల కాల పరిమితితో పాలకవర్గ చైర్మన్‌గా కేతేపల్లి మాజీ ఎంపీపీ గుత్తా మంజుల మాధవరెడ్డిని, వైస్ చైర్మన్‌గా నకిరేకల్ మండలంలోని ఓగోడు గ్రామ మాజీ సర్పంచ్ దూలం సోమయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఈ 16మంది డైరెక్టర్లుగా కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామానికి చెందిన పుట్ట నర్సింహారెడ్డి, పామనగుండ్లకు చెందిన బండారు కృష్ణయ్య, కట్టంగూర్‌కు చెందిన గుండు పరమేష్, కేతేపల్లి మండలంలోని గుడివాడకు చెందిన షేక్ లతీఫ్, కొప్పోలుకు చెందిన కప్పల సైదులు, కేతేపల్లికి చెందిన బయ్య ముత్తయ్య, మాందాసు పరశురాములు, నకిరేకల్ మండలానికి చెందిన బొల్లెద్దు లక్ష్మయ్య మొగిలి బుచ్చమ్మను నియమించింది.

రూ.100కోట్ల డిపాజిట్లు సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకు పరిధిలో 90 రోజుల్లో రూ.100కోట్ల డిపాజిట్‌ల సేకరణ పూర్తి చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో నిర్వహించిన మేనేజర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు మొదటి వారంలో ప్రారంభమైన ఈ డిపాజిట్‌ల సేకరణ మాసోత్సవం సంతృప్తికరంగా ఉందన్నారు. ఇప్పటికే రూ.42కోట్ల డిపాజిట్‌లను సేకరించడంపై అధికారులను, ఉద్యోగులను, సొసైటీ చైర్మన్లను అభినందించారు. సహకార సమృద్ధి డిపాజిట్ పథకంతో పాటు సహకార లక్ష్మి పథకానికి సైతం డిపాజిట్‌లను చేపట్టాలన్నారు. రానున్న కొద్ది రోజుల్లో రూ.100కోట్ల డిపాజిట్‌లను సేకరించడం ద్వారా సహకార బ్యాంకుల అభివృద్ధికి ప్రతి కృషి చేయాలన్నారు. అదేవిధంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేయాలని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీలు, బ్యాంకులు పనిచేయాలని సూచించారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను అత్యున్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వ్యాపారం రూ.2,300కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.2,660కోట్లకు చేరిందన్నారు. రానున్న రోజుల్లో రూ.3 వేల కోట్ల లక్ష్యాన్ని విధిస్తున్నామన్నారు. పంట రుణాలను రూ.లక్ష నుంచి రూ.1.50లక్షకు పెంచామన్నారు. ఎన్ఎల్ఎం పథకం కింద 50శాతం సబ్సిడీతో గొర్రెలు, నాటుకోళ్ల పెంపకానికి సబ్సిడీ ఇస్తామని చెప్పారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో రావులపాటి శంకర్‌రావు, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, కొండ సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



అలుగు పోస్తున్న కేతేపల్లి నిమ్మలమ్మ చెరువు

● **అలుగుపోస్తున్న తటాకాలు**

కేతేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వర్షాకాలం నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు ఏఎమ్మార్పీ, మూసీ కుడికాల్వ ద్వారా చెరువులు, కుంటలకు నీరు చేరింది. వర్షం నీటితో కొంతమేర నిండి ఉన్న ఆయా చెరువులకు మూసీ, ఏఎమ్మార్పీ నీరు చేరడంతో చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి.

వారంరోజులుగా ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు అయిటిపాముల చెరువు నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మండల పరిధిలోని ఏఎమ్మార్పీ ఆయకట్టు చెరువులకు నీరు చేరుతోంది. ఏఎమ్మార్పీ డీ49 కాల్వ నీటితో మండలంలో ఆయకట్టేతర గ్రామాలుగా ఉన్న ఇనుపాముల, గుడివాడ, బండపాలెం, కొండకిందిగూడెం, కేతేపల్లి, కొర్లపహాడ్ గ్రామాలకు చెందిన చెరువులు కుంటలు నిండాయి. మరోవైపు మూసీ కుడికాల్వకు విడుదలయ్యే నీటితో ఆయకట్టులోని కాసనగోడు, బొప్పారం, కొత్తపేట, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, తుంగతుర్తి, కొప్పోలు, చెరుకుపల్లి గ్రామాలకు చెందిన చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయి. యాసంగి సీజన్‌కు ముందు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడంతో ఆయా గ్రామాల చెరువుల ఆయకట్టుతో పాటు వ్యవసాయ బావులు, బోర్ల నీటితో యాసంగి పంటలు సాగు చేసే రైతులు సాగుపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉండటంతో వచ్చే వేసవిలో తమ గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా తగ్గుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్మోగిన అయ్యప్ప

శరణుఘోష



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

7

వడ్డీభారం లేని రుణం

ఎంతో ప్రయోజనం

- కర్నాటక సొసైటీల్లో అధ్యయనం
- అధ్యయన యాత్రలో అనేక విషయాలపై అవగాహన
- ఉమ్మడి జిల్లాలో అదనంగా మరో 50 సొసైటీలు
- రైతుల సంక్షేమం, సొసైటీల బలోపేతమే లక్ష్యం 7



నీరు తాగితేనే..



'ఈ సృష్టిలో జీవరాశి మనుగడకు వాయువు ఎంత ముఖ్యమో నీరు కూడా అంతే ముఖ్యం. ఇది తెలిసినా.. నిర్లక్ష్యం చేస్తూనే ఉంటాం. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థుల విషయంలో వారికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు, పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సరైన అవగాహన కల్పించకపోవడంతో వారు తాగునీటికి దూరమవుతున్నారు. నీరు తాగకపోవడంతో అనేక రుగ్మతలకు లోనవుతున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే చిన్నారులు నిత్యం మంచినీళ్లు తాగేలా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.'

- ఆరోగ్యంగా ఉంటారు.. లేదంటే ఇబ్బందే
- ప్రమాదమంటున్న నిపుణులు
- నీళ్లు తక్కువ తాగుతున్న విద్యార్థులు
- ప్రతీ విద్యార్థి సగటున రెండు నుంచి మూడు లీటర్ల నీరు తీసుకోవాలి
- లేకుంటే అనారోగ్యం పాలవుతారని వైద్య నిపుణుల హెచ్చరికలు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు తగినన్ని సౌకర్యాలు ఉన్నాయో లేదో, ఉంటే అవి ఎంతవరకు పరిశుభ్రంగా ఉన్నాయో చూడాల్సిన గురుతర బాధ్యత విద్యాశాఖాధికారులపై ఉంది. పాలక ప్రభుత్వం, విద్యాశాఖాధికారుల, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఫలితంగా విద్యార్థులకు అవసరమైన నీరు శరీరానికి అందక చిన్నతనంలోనే మూత్రాశయ వ్యాధులు, కిడ్నీ వ్యాధులకు లోనవుతున్నారు. ఎంతో భవిష్యత్ ఉండి పిల్లల భవిష్యత్‌ను చీకటిమయం చేస్తున్నారు. ఇదేదో ఎవరో చెప్పింది కాదు సుమా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ తన సర్వే నివేదికలో పేర్కొన్న విషయాలు.

భూదాన్‌పోచంపల్లి పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సాత్విక కేవలం రెండు గ్లాసుల నీళ్లు మాత్రమే తాగుతదంట. ఎందుకు నీళ్లు తాగవని అడిగితే అతని నుంచి వచ్చే సమాధానం ఒక్కటే. నీళ్లు తాగితే టాయ్‌లెట్‌కు వెళ్లాలి. అక్కడ దుర్వాసన వస్తుంది. అందుకే పాఠశాలలో తాగను అని చెప్పింది.

దినేష్ అనే చిన్నారి మూడో తరగతి చదువుతున్నాడు. లీటర్ బాటిల్ నీళ్లు పోసుకుని బ్యాగులో పెట్టుకొని ఉదయం 8గంటలకు పాఠశాలకు వెళ్తాడు. 10 గంటలపాటు పాఠశాలలో ఉన్న ఆ చిన్నారి తాగిన నీళ్లు కేవలం అరలీటరు మాత్రమే.

నూటికి 40 శాతం మంది

నూటికి నలభై శాతం మంది పిల్లలు అనేక రోగాలకు లోనవుతున్నారని ఆరోగ్య సంస్థ చెప్పిన వాస్తవం. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు. సగటున రోజూ పాఠశాలల్లో విద్యార్థులు 8 గంటల వరకు గడుపుతారు. ఏ వో కొన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో తప్ప సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేక మూత్ర విసర్జనకు వెళ్లడంలేదు. దాహం వేస్తే మధ్యలో నీరు తాగడానికి ఉపాధ్యాయులు అనుమతి ఇవ్వరనే భయంతో కొంత మంది చిన్నారులు, మరికొందరు పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడంతో నీరు తాగితే ఎక్కడ మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తుందోనని తాగడంలేదు. దీంతో చివరకు పిల్లలు తాగునీటికి దూరమవడంతో అనారోగ్యం పాలవుతున్నారు.

ప్రతీ రోజు పిల్లలు సగటున 2నుంచి 3 లీటర్ల నీరు తీసుకోవాలి. అయితే పిల్లలు పాఠశాలల్లో ఉన్నప్పుడు రెండు గ్లాసులు, ఇంటి దగ్గర మూడు గ్లాసులు, రోజుకు కేవలం లీటరు నీటిని మాత్రమే తాగుతున్నారు.

శరీరానికి నీరు ఎందుకవసరమంటే..

- మనం తిన్న ఆహారం ద్రవ పదార్థంగా మారడానికి నీటి అవసరం ఉంది.
- నీరు తీసుకోవడంవల్ల గుండెకు రక్తం సరఫరాతో పాటు మన చర్మం కాంతివంతంగా ఉంటుంది.
- చర్మం పొడి బారదు, నిగనిగలాడుతుంది.
- మూత్ర వ్యాధులు, కిడ్నీ జబ్బులు దరిచేరవు.

నీళ్లు తాగకపోతే అనర్థాలు ఎన్నో

- వంట్లో నీరు తగ్గి డీహైడ్రేషన్‌కి గురై వాంతులు, విరేచనాలు, వైరల్ జ్వరాల బారినపడతారు.
- కళ్లు తిరుగుతాయి.
- కడుపులో అల్సర్ ఏర్పడుతుంది.
- జాయింట్ పెయిన్స్ వస్తాయి.
- చర్మం పొడి బారిపోతుంది.
- రక్త కణాలు ఎండిపోతాయి.
- కిడ్నీల సాంద్రత సన్నగిల్లి చెడిపోతాయి.
- గుండె ప్రక్రియ ఆగిపోయి చివరకు ఆకస్మిక మరణానికి దారితీస్తుంది.





మరుగుదొడ్డికి వెళ్లాల్సి వస్తోందనే భయంతో..



పాఠశాలల్లో పిల్లలు ఇంటి దగ్గరి నుంచి లీటర్ బాటిల్ తెచ్చుకుంటారు. సగం వరకే తాగి తిరిగి ఇళ్లకు పట్టుకొని వెళ్తుంటారు. మరికొందరైతే కొంత మోతాదులో తీసుకుంటున్నారు. ఆడపిల్లలైతే నీరు తాగితే మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తోందని తక్కువ స్థాయిలో నీరు తాగుతున్నారు. దీనికి కారణం కూడా ఉంది. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగ్గాలేవు. విద్యార్థులకు నీటి వల్ల ఉపయోగాలు చెబుతుంటాం. ఇంటి దగ్గర తల్లిదండ్రులు కూడా చెప్పి పిల్లలను పాఠశాలకు పంపాలి.

- పగిళ్ల రమాదేవి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు

నీటి విషయంలో నిర్లక్ష్యం తగదు



పాఠశాలల్లో చదివే పిల్లలు నీరు తీసుకోవడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. అందులోనూ వేసవి కాలంలో తగిన విధంగా నీరు తాగాలి. వేడి వలన శరీరంలోని నీరు ఆవిరి అయిపోతుంది. దీని వలన డీహైడ్రేషన్ వంటి పలు సమస్యలకు గురవుతారు. తాగేందుకు మంచినీరే కాదు... కొబ్బరి బోండాలు, బార్లీ, మజ్జిగ, తదితర పండ్ల రసాలు సేవించవచ్చు.

- డాక్టర్ శ్రీవాణి, వైద్యాధికారి, భూదాన్‌పోచంపల్లి

ఉపాధ్యాయులు చొరవ చూపాలి



పాఠశాలకు వెళ్లినప్పుడు సీసాతో నిండుగా పట్టి ఇస్తున్నాం. అయితే సగం వరకు తాగి తిరిగి ఇంటికి బాటిల్ తీసుకొచ్చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగ్గా లేక వెళ్లాల్సి వస్తుందన్న భయంతో తక్కువ మోతాదులో నీరు తీసుకుంటున్నారు. తరగతి గదిలో మధ్యమధ్యలో నీరు తాగడానికి ఉపాధ్యాయుల అనుమతులు ఇవ్వరనే భయంతో విరామ సమయంలోనే తాగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే తల్లిదండ్రులకు నీటిని సేవించాలనే విషయంపై పెద్దగా అవగాహన ఉండకపోవచ్చు. ఉపాధ్యాయులు నీరు తాగునీటి వల్ల కలిగే ఉపయోగాలు చెప్పాలి.

- గోలి పల్లవి, విద్యార్థి తల్లి, భూదాన్‌పోచంపల్లి

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నతపాఠశాల	విద్యార్థులు
నల్లగొండ	1,126	128	220	88,808
సూర్యాపేట	700	81	217	66,999
యాదాద్రి	480	70	171	55,204

డిండి ప్రాజెక్టు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్, రైతులు

డిండి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఆరుతడి పంటలు కోసం నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. ఈ యాసంగిలో ప్రాజెక్టు పరిధిలోని 12,750 ఎకరాలు సాగులోకి రానుడగా కుడి కాల్వ పరిధిలో 250, ఎడమ కాల్వ పరిధిలో 12,500 ఎకరాలకు సాగు నీరు అందనుంది. సుమారు 6వేల మంది రైతులకు ప్రయోజనం కలుగ నుంది. ప్రాజెక్టు చివరిలో ఉన్న దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామపరిధిలో ఉన్న 250 ఎకరాలకు కూడ సాగునీరు అందనుంది. ప్రధాన కాల్వ ద్వారా గోనకోలు, డిండి, బొగ్గులదొన గ్రామాల పరిధిలోని 1,200 ఎకరాలు, నార్త్, ఈస్ట్ పరిధిలో 6వేల ఎకరాలు, నార్త్ వెస్ట్ పరిధిలో 4వేల ఎకరాలకు సాగునీరు అంద నుంది. 2023 వానకాలం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వ కింద 12,750 ఎకరాలు సాగు లోకి వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టు గరిష్టనీటిమట్టం 36 అడుగులు(2.4 టీఎం సీలు) కాగా ప్రస్తుతం నీటి నిల్వ గరిష్టస్థాయి 36 అడుగులతో నిండి ఉంది. ఈ నీటితో యాసంగి సాగుచేసే పంటలకు పూర్తిగా సరిపోతుందని అధికారులు తెలి పారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డి.వెంక టేశ్వర రావు, తిప్పర్తి రుక్మారెడ్డి, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, కుర్మారెడ్డి, శైలేజ్, శశిధర్‌రెడ్డి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, సాయి పాల్గొన్నారు.

ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కర్తయ్య

నాగార్జునసాగర్,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఒలింపిక్ అసోషియేషన్ కార్యవర్గ సభ్యుడిగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన కర్తయ్య ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనను రాష్ట్ర కార్యకర్త సభ్యుడిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం కర్తయ్య జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.

వర్గీకరణతోనే ఎస్సీ ఉప కులాలకు లబ్ధి



ఏకసభ్య కమిషన్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మధుబాబు, సంఘం నాయకులు

నల్లగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల ఉమ్మడి జిల్లా నేతలు కోరారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రాలు అందజేశారు. వర్గీకరణ ద్వారానే ఎస్సీ ఉపకులాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిండు అసెంబ్లీలో మాదిగ, ఉపకులాలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ఉమ్మడి జిల్లా నాయకులు కందుకూరి సోమయ్య మాదిగ, చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, జానకిరామయ్యచౌదరి, బకరం శ్రీనివాస్‌మాదిగ, బోడ సునీల్‌మాదిగ, మల్లెపాక వెంకన్నమాదిగ, యాతాకుల రాజయ్యమాదిగ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్టికల్ 341కు విరుద్ధం

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి పూర్తిగా విరుద్ధమని, వర్గీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు అన్నారు. ఏకసభ్యకమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు కల్పించిన 15శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం 1267కులాల్లో, ఏపీ, తెలంగాణల్లో 59 కులాలలో ఎవరు అత్యంత వెనకబాటుకు గురైనారో వివరాలు సేకరించి రోస్టర్ పద్ధతిలో, ప్రత్యేక అత్యవసర చర్యల కింద విద్య, వైద్యం, ఉద్యోగ, ఆరోగ్య, ఉపాధి, ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక శిక్షణలు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. ఇతరులతో పోటీపడి సమానంగా ఎదిగేలా కృషి చేయాలే తప్ప, వర్గీకరణ పేరుతో కులవివక్ష అంతరాలను పెంచడం మంచిది కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లింగస్వామి, అంగరాజ స్వర్ణలత, కిరణ్‌కుమార్, ఆకాష్ పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు బీజేపీ సంపూర్ణ మద్దతు

1994 నుంచి మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సాగిన ఎస్సీవర్గీకరణ ఉద్యమం న్యాయబద్ధమైందని బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్‌కు లేఖ అందజేశారు. ఎస్సీ వర్గీకరణ చేసుకునే అంశాన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికారమిస్తూ సుప్రీంకోర్టు తాజాగా ఆదేశాలిచ్చిందని, తెలంగాణలో వర్గీకరణ చేపట్టాలని సూచించారు. వర్గీకరణను అమలుపరచి, మాదిగ, ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు.

వర్గీకరణకు వికలాంగుల హక్కుల పోరాట సమితి మద్దతు

ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని, అందుకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని దివ్యాంగ హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము హరికుమార్ పేర్కొన్నారు. ఏకసభ్య కమిషన్‌కు లేఖ అందజేశారు. ఎస్సీల్లో వెనకబడిన మాదిగ, ఉపకులాలకు రిజర్వేషన్ల వర్గీకరణతో సమన్యాయం జరుగుతుందన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో వారి జనాభాదామాషా ప్రకారం ఫలాలు దక్కుతాయన్నారు.

జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని ధర్మసమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి తలారి రాంబాబు, లింగస్వామి, శంకర్, శాంతికుమార్, నగేశ్ కోరారు. ఈ మేరకు వారు ఏకసభ్య కమిషన్‌కు లేఖ అందజేశారు. ఎస్సీలలో 70శాతం ఉన్న మాదిగలకు 10శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, 30శాతం లోపు ఉన్న మాలలకు 4 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, ఒక శాతం లోపు ఉన్న ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్ కల్పించాలని కల్పించాలన్నారు. తద్వారా రిజర్వేషన్ల ఫలాలు తగురీతిలో పొందలేకపోయిన కులాలకు, జనాభాప్రాతిపదికన వర్గీకరణ చేస్తే రాజ్యాంగ మూలసూత్రమైన సామాజికన్యాయం చేసినట్లవుతుందని పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలి

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన వర్గీకరించాలని మాదిగ జాగృతి సంఘం నల్లగొండ జిల్లా కమిటీ సూచించింది. ఈ మేరకు వారు ఏకసభ్య కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కె. హరికిషన్, పి. ఎల్లేశ్, దేవేందర్, సహదేవ్, నాగరాజు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్నమాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు సూచించారు. ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జాన్‌విల్సన్, లంకపల్లి నగేశ్ పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణ ధర్మబద్ధమైనది

ఎస్సీ వర్గీకరణ ధర్మబద్ధమైనదని, సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ కులాల ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు కోరారు. ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. 1970లో బీసీ వర్గీకరణను చేపట్టిన విధంగానే తెలంగాణలోనూ ఎస్సీ వర్గీకరణ చేపట్టి రాజ్యాంగ ఫలాలు అందుకోలేకపోయిన వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ కులగణన చేపట్టాలని, ఉపకులాలకు సైతం తహసీల్దార్ల ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రస్థాయి ఎస్సీ కమిషన్‌లో ఉపకులాలకు ప్రాతినిధ్యం కల్పించాలని విన్నవించారు. కార్పొరేషన్ల పదవులు, గృహనిర్మాణాల్లో ఉపకులాలకు స్థానమివ్వాలని కోరారు.

శిరసనగండ్లలో ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు మృతి

పెద్దవూర, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం శిరసనగండ్ల సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది.. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుడుం రామలింగయ్య(40), దారం పరమేష్(36) దర్వేశిపురం వద్ద బంధువుల శుభకార్యానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై కొత్తలూరు మీదుగా బసిరెడ్డిపల్లికి బయల్దేరారు. అదే రహదారిలో గుర్రంపోడు మండలం నడికుడ గ్రామానికి చెందిన రైతు ట్రాక్టర్‌పై నువ్వుల కట్టెవేసుకొని పెద్దగూడెం నుంచి శిరసనగండ్ల మీదుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామం దాటగానే బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు తలలకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతులు రామలింగయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు, పరమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



శిరసనగండ్లలో ప్రమాదం జరిగిన స్థలం

ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి వెళ్తుండగా..

రామన్నపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన బోడ లింగస్వామి (చిరు) (20) కక్కిరేణి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా మునిపంపుల గ్రామ శివారులో అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని వ్యక్తులు చూసి డయల్ 100కు కాల్ చేయడంతో చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగస్వామి తండ్రి బోడ సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామన్నపేట ఎస్‌ఐ పి మల్లయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పవర్ ఎంప్లాయీస్ యూనియన్ వైటీపీఎస్ కార్యవర్గం

దామరచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో బుధవారం తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ -1535 వైటీపీఎస్ బ్రాంచ్ కొత్త కార్యవర్గాన్ని సంఘం జెన్‌కో కోశాధికారి తుంపురు విజయ్‌కుమార్, రాష్ట్ర నాయకుడు ఖాజామొయినుద్దీన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైటీపీఎస్ శాఖ అధ్యక్షుడిగా కాకటి రాము, కార్యదర్శిగా హెచ్.రమేష్, కోశాధికారిగా చెర్ల శ్రీనివాస్, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ.వజీర్ మాట్లాడుతూ కార్మికులకు, డీపీసీలు నిర్వహించి పదోన్నతులు కల్పించాలని, కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయం, అంబులెన్స్, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని చీఫ్ ఇంజినీర్ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పుట్ట నాగేశ్వర్‌రావు, పి.రాము, కుమారస్వామి, దానం నరసింహారావు, అబ్దుల్ తఖీ, సముద్రాల రాంబాబు పాల్గొన్నారు.



సీఈ సమ్మయ్యకు వినతిపత్రం అందిస్తున్న వైటీపీఎస్ శాఖ నాయకులు

పౌష్టికాహారం దుర్వినియోగం

భువనగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న బాలామృతం దుర్వినియోగం అవుతున్నది. అంగన్‌వాడీ కేంద్రాలు లేదా పిల్లల ఇళ్లలో ఉండాల్సిన బాలామృతం పశువుల కొట్టాలలో దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, కేంద్రాలకు సరుకుల రవాణాపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ఎస్‌ఓటీ పోలీసులు ఓ వ్యవసాయ బావి వద్ద చేపట్టిన తనిఖీల్లో ఒక్కొక్కటి రెండున్నర కిలోల 72 బాలామృతం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. దీంతో బాలామృతం విక్రయించిన మోత్కూర్‌కు చెందిన రవాణా సబ్ కాంట్రాక్టర్ ప్రశాంత్, కొనుగోలు చేసిన భువనగిరికి చెందిన పాడి రైతు చీమల నరేష్‌పై సీడీపీఓ శైలజ చేసిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి బాలామృతం పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.


సమగ్ర దర్యాప్తునకు కలెక్టర్ ఆదేశాలు

భువనగిరిలో వ్యవసాయ బావి వద్ద బాలామృతం ప్యాకెట్లు లభించడంపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై లోతైన విచారణ చేయాలని పోలీసులకు సూచించారు. అలాగే జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాక్ రిజిస్టర్, లబ్ధిదారుల వివరాల ఆధారంగా తనిఖీలు చేయాలని సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో జిల్లాలోని నలుగురు సీడీపీవోలు బుధవారం పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అయితే బాలామృతం సరఫరా చేసిన ప్రశాంత్‌పై మోత్కూర్‌లో నకిలీ పాల తయారీ కేసు కూడా ఉన్నదని పోలీసులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్, సబ్‌కాంట్రాక్టర్లపై పాత్రపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



భువనగిరిలో పట్టుబడిన బాలామృతం సంచులు

నిరంతరం తనిఖీలు చేస్తున్నాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలకు అస్కారం ఇవ్వకుండా నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు రికార్డులను పరిశీలిస్తున్నాం. కలుషిత గుడ్లు, బాలామృతం దుర్వినియోగం ఘటనలు వెలుగు చూస్తుండటంతో కేంద్రాల నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్‌వైజర్లకు సూచించాం.

- నరసింహారావు, జిల్లా సంక్షేమ అధికారి.

భువనగిరిలో శిశు విక్రయం?

భువనగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో శిశు విక్రయం ఘటన వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వితంతువు వివాహేతర సంబంధం నేపథ్యంలో అక్టోబరు 5వ తేదీన ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆ శిశువును జనగామ జిల్లాకు చెందిన సమీప బంధువులకు అప్పగించింది. అయితే శిశు విక్రయం నచ్చని ఆమె పెద్ద కుమార్తె(17) టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో అప్రమత్తమైన సంబంధిత శాఖ అధికారులు ఆమెకు ఫోన్ చేసి శిశు విక్రయంపై ఆరా తీశారు. గురువారం ఆ శిశువును సీడబ్ల్యూసీ ఎదుట ప్రవేశపెట్టాలని ఆదేశించారు. దీంతో శిశు విక్రయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

'క్రీడల శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి'

సంస్థాన్ నారాయణపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అండర్-14 కబడ్డీ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొనడానికి ఎంపికైన విద్యార్థినికి బదులు వేరే విద్యార్థిని పేరును లిస్టులో చేర్చిన జిల్లా క్రీడల అధికారి బెజ్జం బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని మునుగోడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. మునుగోడు నియోజకవర్గం సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన పి.వైష్ణవి మునుగోడు మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోందని, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పి.వైష్ణవి ఉత్తమ కబడ్డీ క్రీడాకారిణిగా, అండర్ 14నుంచి రాష్ట్రం తరపున మహారాష్ట్రలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికైందని తెలిపారు. మహారాష్ట్రలో జరిగే అండర్-14 కబడ్డీ క్రీడల్లో పాల్గొనాల్సిన వైష్ణవికి పి. వైష్ణవికి బదులు నల్లగొండకు చెందిన జి. వైష్ణవి పేరును లిస్టులో చేర్చి నిజమైన క్రీడాకారునికి అన్యాయం చేశారని ఆరోపించారు. బెజ్జం బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వడ్డీలేని రుణం..ఎంతో ప్రయోజనం

- 'కర్ణాటక' సొసైటీల్లో అధ్యయనం
- ఉమ్మడి జిల్లాలో అదనంగా మరో 50 సొసైటీలు
- రైతుల సంక్షేమం, సొసైటీల బలోపేతమే లక్ష్యం



నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

నల్లగొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సహకార బ్యాంకులను వాణిజ్య బ్యాంకులకు దీటుగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాచరణ రూపొందిస్తుంది. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటకలో సహకారరంగ వ్యవస్థ పటిష్టంగా ఉంది. పెద్ద మొత్తంలో టర్నోవర్ కలిగి ఉండటంతో పాటు జీరో వడ్డీ కింద రుణాలు పంపిణీ చేస్తూ రైతుల సంక్షేమం కోసం ఆ రాష్ట్రంలో చేపడుతున్న విధానాలను ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అమలుచేయడం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 108 పీఏసీఎస్‌ల చైర్మన్లతో పాటు కొందరు అధికారులు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. గత నెల 25 నుంచి 28వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ) అభివృద్ధిపై అధ్యయనం చేశారు. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రంలోని కొడుగు జిల్లాలో ఉన్న హతూర్ సొసైటీ, మైసూర్ జిల్లాలోని నందినాథపురం సొసైటీలతో పాటు పలు సొసైటీలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో అమలవుతున్న విధివిధానాలను ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అమలుచేయడానికి వీలవుతుందని అధికారులు, జిల్లా సహకార కేంద్ర పాలకవర్గం భావిస్తుంది.

కర్ణాటక రాష్ట్రంలోని సొసైటీల్లో ఈ విధంగా.....

కర్నాటక రాష్ట్రంలోని పీఏసీఎస్‌లలో అమలవుతున్న విధానాలు తెలంగాణతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జిల్లాలోని 108 సొసైటీల్లో అమలులోకి తీసుకువస్తే రైతాంగానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని సభ్యులు భావిస్తున్నారు. ఉదాహరణకు ఆ రాష్ట్రంలోని కొడుగు జిల్లాలో ఉన్న హతూర్ సొసైటీ కింద కేవలం 5 గ్రామాలు మాత్రమే ఉండగా ఆ సొసైటీ టర్నోవర్ రూ.161 కోట్లు ఉండగా డిపాజిట్లు రూ.40కోట్లు ఉండటం విశేషం. ఆ సొసైటీ పరిధిలో రైతులు మిరియాల పంట ఉత్పత్తిని చేస్తారు. ఇందుకు సొసైటీల నుంచి రుణాలు తీసుకుంటారు. అదేవిధంగా పంటల ఉత్పత్తుల నిల్వల కోసం గోదాంలను కూడా ఆ సొసైటీల ఆధ్వర్యంలో నిర్మించారు. ఇక మైసూర్ జిల్లాలోని నందినాథపురం సొసైటీకి సంబంధించి ఆ సొసైటీ పరిధిలో 13 గ్రామాలు ఉన్నాయి. ఈ సొసైటీ టర్నోవర్ రూ.180 కోట్లు ఉండగా రూ.50 కోట్ల డిపాజిట్‌తో నడుస్తుంది. ఆ సొసైటీ పరిధిలోని గ్రామాల్లో వరి సేద్యంతో పాటు వర్జినియా పొగాకు, మొక్కజొన్న, అల్లం పంటలను పండిస్తారు. ఆ ప్రాంత రైతుల కుటుంబాలలో పెళ్లిళ్లకు కూడా రుణాలు విరివిగా అందిస్తారు. అయితే ఆ రుణాలన్నింటినీ 5 శాతం వడ్డీ కింద అందజేస్తారు. రైతులు తిరిగి చెల్లించేటప్పుడు వడ్డీ కట్టే అవసరం ఉండదు. ఆ వడ్డీని ప్రభుత్వమే భరిస్తుండగా రైతులకు వడ్డీ భారం లేకుండా రుణాలు అందుతున్నాయనేది స్పష్టం అవుతుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన అధ్యయన యాత్ర రాష్ట్రంలోని మిగతా ఉమ్మడి జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా సొసైటీలకు ప్రయోజనకారిగా మారే అవకాశం ఉంది.

అదనంగా మరో 50 సొసైటీలు

ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 108 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. సొసైటీలను రైతులకు మరింత చేరువ చేయడం కోసం అదనంగా మరో 50 సొసైటీలను ఏర్పాటు చేయాలని డీసీసీబీ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఏ మండలంలో సొసైటీలు అవసరమనేది చర్చిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన మండలాలతో పాటు కొన్ని సొసైటీల పరిధిలో అధిక గ్రామాలు ఉంటే వాటిని కలిపి కొత్త సొసైటీలు ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. అందుకు అనుగుణంగా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయనుంది. వచ్చే జనవరి నెలాఖరు వరకు కొత్త సొసైటీలను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. వాణిజ్య బ్యాంకులతో సమానంగా పీఏసీఎస్‌లను, సహకార బ్యాంకులను రూపుదిద్దడం కోసం కసరత్తు జరుగుతుంది. అదనంగా కొత్త సొసైటీలు 50 ఏర్పాటైతే సహకార రంగ వ్యవస్థ రైతులకు మరింత చేరువకానుంది. కర్ణాటక రాష్ట్రంలో సొసైటీల అభివృద్ధికి ఇచ్చిన రుణాలను నూటికి నూరు శాతం రికవరీ చేయడంతో పాటు డిపాజిట్లను పెంపొందించుకోవడమే కారణమని గుర్తించారు. ప్రస్తుతం డీసీసీబీ రూ.2660కోట్ల టర్నోవర్‌లో ఉంది. దీనిని రూ.3వేల కోట్ల టర్నోవర్ పెంచుకోవడం కోసం కొత్త పథకాలను తీసుకువచ్చిరు. అదేవిధంగా ఈ నెలాఖరులోగా తిప్పర్తి, ఆత్మకూర్, దామరచర్ల, గరిడేపల్లిలో నూతన బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రణాళికలు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార బ్యాంకులను బలోపేతం చేయడం కోసం ప్రణాళికలు రూపొందించాం. గత నెలలో కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అధ్యయన యాత్ర సొసైటీల అభివృద్ధికి ఉపయోగపడనుంది. త్వరలోనే కర్ణాటక మాదిరిగానే విధి విధానాలు అమలుచేయడం కోసం నిర్ణయం తీసుకుంటాం. అదేవిధంగా రైతులకు మరింత చేరువయ్యేందుకు కొత్త సొసైటీలను ఏర్పాటు చేయనున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాల కోసం రుణాలను రూ.25 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.35లక్షలు ఇంటి రుణాలుగా ఇస్తాం. బంగారంపై లోన్లు ప్రారంభంలో రూ.328 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.520 కోట్లకు పెరిగింది. అంటే దాదాపు రూ.200 కోట్ల గోల్డ్‌లోన్లు పెంచాం.

\- కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా

ఎండలో ధరల మంట

(5వ పేజీ తరువాయి)

కూరగాయలు సేద్యం చేసిన ఓ రైతు ఈ ఏడాది ఒక ఎకరంలో మాత్రం చేశాడు. ఇలా సాగు తగ్గడంతో పంట దిగుబడి కూడా తగ్గింది. జూలైలో పంట సాగు ప్రారంభిస్తే సెప్టెంబరు, అక్టోబరు నెలకు కోతకు వస్తుంది. డిసెంబరు నెల అయినా పంట లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

నిత్యావసరాలపై పన్ను ప్రభావం

సామాన్యులు ఎక్కువగా వినియోగించే నిత్యావసరాలు పప్పు, వంట నూనెపై ప్రభుత్వం జీఎస్టీ, రవాణా పన్నులు పెంచింది. దీంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో పన్నులు పెరగడం, ప్రకృతి వైపరీత్యాలతో వాణిజ్య పంటలు, ఉల్లి దిగుబడులు తగ్గడంతో వాటి ధరలు అమాంతం పెరిగాయి. ప్రభుత్వం ఆదాయమే లక్ష్యంగా గాక, ప్రజల మేలును దృష్టిలో ఉంచుకొని పన్నుల పెంపును ఉపసంహరించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటేనే..

పెరుగుతున్న ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలపై ఆర్థికభారం పడుతోంది. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటే ధరలను కొంతైనా నియంత్రించవచ్చు. నిత్యావసరాలపై పన్నులు, రవాణా సుంకాలు తగ్గిస్తే ధరలు తగ్గే అవకాశం ఉంది. ఏడాది మొత్తం ఒకే రకమైన ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అత్యవసరాలకే ప్రాధాన్యం

వినియోగదారులు అనవసర ఖర్చులు తగ్గించుకొని, అత్యవసరాలకే అధిక ప్రాధాన్యం ఇస్తే ఆర్థిక భారం తప్పుతుందని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌లో సీజన్ బట్టి కూరగాయల, పండ్ల ధరలు తక్కువగా ఉంటాయి. ఆయా సీజన్‌లో లభించే కూరగాయలు, పండ్లు కొనుగోలు చేస్తే నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం ఉండదు. అంతేగాక చిరుతిండ్లు మాని, ఇంటి వంటకాలనే వినియోగిస్తే ఆరోగ్యకరమని, ఖర్చు కూడా తగ్గుతుంది. ఇక చిన్న రోగాలకు సైతం ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. జలుబు, దగ్గు, ఒంటి నొప్పులకు వైద్యుడు దగ్గరకు వెళ్లడం మానుకోవాలని దీంతో ఆర్థిభారం కూడా తప్పుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పచ్చి మిర్చి, ఉల్లి ధరలు పెరగడంతో వంట చేయాలంటే భయమేస్తోంది. వీటికి తోడు గుడ్డు ధర కూడా పెరిగింది. పచ్చళ్లతోనే కాలం వెళ్లదీస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

● కె.మణి, గృహిణి, కోదాడ

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	582.90
టీఎంసీలు	291.3795
ఎడమకాల్వకు నీటి విడుదల	4,679
కుడికాల్వకు	8,023
విద్యుత్ కేంద్రం ద్వారా	29,069
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	43,571
అవుట్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.41 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్నిగేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.57 అడుగులు
టీఎంసీలు	4.35
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	195.48 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	215.52 క్యూసెక్కులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి, డిసెంబరు 11: ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేతేపల్లి ఎస్ఐ ఎ.శివతేజగౌడ్ కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో కక్షిదారులు, వివిధ గ్రామాల వారితో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసుల్లోని ఇరు వర్గాల వారూ లోక్ అదాలత్‌తో రాజీ చేసుకుని కేసుల నుంచి బయటపడాలన్నారు. రాజీమార్గం రాజమార్గంగా భావించి రాజీ పడదగిన కేసులు, డ్రంకెన్ డ్రైవ్, పిటీ కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

గుడిసెలో పేలిన గ్యాస్ సిలిండర్

- నాలుగు పూరిళ్లు దగ్ధం..
- ఏడుగురికి స్వల్ప గాయాలు
- సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో ఘటన



గ్యాస్ సిలిండర్ పేలడంతో దగ్ధమవుతున్న మంగమ్మ గుడిసె

పెన్‌పహాడ్, సూర్యాపేట సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓ గుడిసెలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో గుడిసె దగ్ధమై అందులో ఉన్న గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలింది. ఆ మంటలు మరో మూడు గుడిసెలకు అంటుకుని క్షణాల్లో అవి కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి. గుడిసెల్లో ఉన్న వారు అప్రమత్తమై పరుగులు తీయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. నాలుగు గుడిసెలకు కలిపి సుమారు రూ.12లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. బుధవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామపంచాయతీ పరిధిలోని బుడిగ జంగాలకాలనీలో ఈ సంఘటన జరిగింది. జంగాల కాలనీకి చెందిన కడమంచి గంగమ్మ గుడిసెలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్‌కు అంటుకోవడంతో అది పేలింది. ఇంట్లో ఉన్నవారు భయకంపితులై వెంటనే బయటికి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. గంగమ్మ ఇంటి పక్కన ఉన్న కడమంచి సాయమ్మ, పర్వతం లక్ష్మణ్, పర్వతం లక్ష్మమ్మ గుడిసెలకు కూడా మంటలు అంటుకొని అవి కూడా పూర్తిగా కాలిపోయాయి. నాలుగు ఇళ్లలో ఉన్న వంట సామగ్రి, ధాన్యం, బియ్యం, దుస్తులు, మంచాలు, ఇతర సామగ్రి, భూమి పట్టా పాస్ పుస్తకాలు, రేషన్‌కార్డులు, ఉపాధి హామీ పుస్తకాలు కాలిబూడిదయ్యాయి. సూర్యాపేట నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పింది. అప్పటికే గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. ఆర్ఐ రంజిత్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఒక్కో ఇంట్లో రూ. 3లక్షల చొప్పున ఆస్తి నష్టం జరిగిందని, మొత్తం రూ. 12లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు. గుడిసెల నుంచి వస్తువులు తీసుకు రావడానికి ప్రయత్నించిన కాలనీవాసులు పర్వతం సైదమ్మ, పర్వతం మంగమ్మ, పర్వతం వెంకన్న, పర్వతం శ్రీను, కమంచి నాగయ్య, పర్వతం సతీష్, పర్వతం యలమంచమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

క్షతగాత్రులకు సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో చికిత్స

క్షతగాత్రులకు సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో డాక్టర్లు చికిత్స చేశారు. మంటలకు గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలిపోయిందని, ఆ ధాటికి గ్యాస్ సిలిండర్ పేలిందని బాధితులు పర్వతం యలమంచమ్మ, పర్వతం సైదమ్మ, పర్వతం సతీష్, పర్వతం శ్రీను, పర్వతం మంగమ్మ తెలిపారు. ఆ సమయంలో ఏం జరిగిందో తెలుసుకునే లోపే తమకు గాయాలయ్యాయని తెలిపారు. పర్వతం సతీష్ అనే పది సంవత్సరాల బాలుడి తలకు గాయమైంది. ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె సత్యనారాయణ తెలిపారు.

యాదగిరిగుట్టలో అయ్యప్ప శరణుఘోష



యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

- వైభవంగా మాలధారుల యాద'గిరి' ప్రదక్షిణ



లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప శరణుఘోషతో యాదగిరిగుట్ట మార్మోగింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయం కొండ చుట్టూ బుధవారం అయ్యప్పమాలధారులు గిరిప్రదక్షిణ చేపట్టారు. దేవస్థానం అధికారులు విస్తృత ప్రచారం చేపట్టగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 10వేల మంది మాలధారులు ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఉదయం 6గంటలకు వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ ఈవో ఏపూరు భాస్కర్‌రావు గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45నిమిషాల పాటు అయ్యప్ప మాలధారులు స్వామిని స్మరిస్తూ ప్రదక్షిణ పూర్తి చేశారు. భజనలు, భక్తిగీతాలు, వైకుంఠద్వారం నుంచి అయ్యప్ప స్వామివారి సేవతో ప్రదక్షిణ పూర్తికాగానే వివిధ మార్గాల ద్వారా కొండపైకి చేరుకున్నారు. దర్శన క్యూలైన్లు అయ్యప్పనామ స్మరణతో మార్మోగింది. కాగా, ఆలయంలో ఏకాదశి సందర్భంగా అర్చకులు శాస్త్రోక్తంగా లక్ష పుష్పార్చన చేశారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగ బుధవారం ఆత్మకూర్(ఎస్) పోలీసులకు పట్టుపడ్డాడు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్‌లో తెలిపిన వివరాల ప్రకారం మండల మండలంలోని నసీంపేట బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న చివ్వెంల మండలం బండమీది చందుపట్లకు చెందిన బొందికోళ్ల సైదులును బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైదులును విచారణ చేయగా గతంలో ఆత్మకూర్(ఎస్)మండలం పరిధిలోని ముక్తకొత్తగూడెం, ఏపూర్, కోటినాయక్‌తండాలో తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడి బంగారు అభరణాలు, తోపాటు నగదును అపహరించినట్లు తెలిపారు.

ఖమ్మం, నేలకొండపల్లి, ఉమ్మడి నల్లగొండ, నకిరేకల్, చిట్యాల మూడ్లులపల్లి, రాచకొండ కమిషనరేట్ పరిధిలో మీర్‌పేట్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇతని వద్ద ద్విచక్రవాహనం , మూడున్నర తులాల బంగారు అభరణాలు, సుమారు నాలుగు తులాల వెండి, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

సీఎంఆర్ ఇవ్వకుండా మిల్లర్ మోసం

- రూ.217.55కోట్ల ధాన్యం బహిరంగ మార్కెట్లో విక్రయం
- సీఎంఆర్ అప్పగించని మిల్లులపై కేసు

నేరేడుచర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ప్రభుత్వానికి అప్పగించని రైస్ మిల్లుల యజమానిపై పౌరసరఫరాల అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన తిరుమల రైస్ కార్పొరేషన్, గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామానికి చెందిన సంతోషిమాత రైస్ కార్పొరేషన్‌కు చెందిన యజమాని గౌరు రాజేష్ ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా రూ.217.55 కోట్లకు మోసం చేసినట్లు అధికారుల తనిఖీలో బయటపడింది. 2022-23 వానాకాలం, యాసంగి, 2023-24 వానాకాలం సీజన్‌లో తిరుమల రైస్ కార్పొరేషన్(పార్ బాయిల్డ్) రూ.107.16కోట్ల విలువగల 32,779 మెట్రిక్ టన్నుల ధాన్యం, సంతోషిమా పార్‌బాయిల్డ్ రూ.110.39 కోట్ల విలువైన 33,936 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇవ్వగా తిరిగి బియ్యం ఇవ్వలేదు. ఈ నెల 10వ తేదీన రెండు మిల్లుల్లో పౌరసరఫరాల అధికారులు తనిఖీ చేయగా, ధాన్యం లేకపోవడంతో బయట విక్రయించినట్లు తేలటంతో కే సు నమోదు చేశారు. బియ్యం ఇవ్వకుండా బయట విక్రయించిన మిల్లర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సివిల్ సప్లయ్ డీఎం టీఎస్ఎస్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

మనస్తాపంతో బాలిక బలవన్మరణం

- మూడు రోజులుగా చికిత్స పొందుతూ మృతి

నాంపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో క్రిమి సంహారక మందు తాగిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాంపల్లి మండల పరిధిలోని నేరేళ్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముసుకు దశరథ, పున్నమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె కీర్తి (16) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటుంది. కొద్ది రోజులుగా తల్లిదండ్రులు ఘర్షణ పడుతుండటంతో మనస్థాపం ఆమె మనస్థాపానికి గురైంది. ఈ నెల 9వ తేదీన క్రిమిసంహారక తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. బాలిక తల్లి పున్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో బీహార్ యువకుడు కార్మికుడు మృతి



మేఘనాథ్‌కుమార్ మృతదేహం

చిట్యాలరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో రోడ్డును యంత్రంతో కటింగ్ చేస్తుండగా విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎన్.ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన మేఘనాథ్‌కుమార్ (20) సోదరుడు అజిత్‌కుమార్‌తో కలిసి రోజువారీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వట్టిమర్తి వద్ద సీసీ రోడ్డు పనుల నిర్మాణంలో రోడ్డును కటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతం జరిగింది. దీంతో యంత్రం వదేసి ఒక్కసారిగా కింద పడిపోయాడు. సోదరుడు అజిత్‌కుమార్, పెదనాన్న కుమారుడు పరమేశ్వరన్‌కుమార్‌తో పాటు పలువురు హుటాహుటిన మేఘనాథ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దనాన్న కుమారుడు పరమేశ్వరన్‌కుమార్ బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మ తెలిపారు.

'నా చావుకు భార్య, బావమరిది, అత్తే కారణం'

- వాట్సాప్ స్టేటస్ పెట్టి యువకుడి బలవన్మరణం



మాదగోని ప్రశాంత్ (ఫైల్)

శాలిగౌరారం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): "నా చావుకు నా భార్య, ఆమె తమ్ముడు, అత్తే కారణమని వాట్సాప్ స్టేటస్ పెట్టి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో పాటు పంచాయితీలో దూషించడంతో జీవితంపై విరక్తి చెందిన ఒక యువకుడు వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన మాదగోని ప్రశాంత్ (30) నకిరేకల్‌లో మొబైల్ షాప్ నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నాడు. రోజు నకిరేకల్ నుంచి వల్లాలకు వచ్చి వెళ్లేవాడు. ప్రశాంత్‌కు సూర్యాపేటకు చెందిన శివలీలతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. గతేడాది నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవలే భార్య శివలీల తన తల్లిగారింటికి వెళ్లింది. వివాదాల నేపథ్యంలో మంగళవారం సూర్యాపేట పట్టణంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ జరిగింది. ఆ మాదగోని ప్రశాంత్ భార్య శివలీల, అత్త, బావమరిది కలిసి అతడిని తీవ్ర పదజాలంలో దూషించారు. దీంతో మనస్థాపానికి చెందిన ప్రశాంత్ వల్లాలకు చేరుకొని మంగళవారం అర్ధరాత్రి తన వ్యవసాయ భూమిలో ఉన్న వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రశాంత్ తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

ఆరుగురు యువకులపై న్యూసెన్స్ కేసు

దేవరకొండ, డిసెంబరు, 11 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి మత్తులో ఘర్షణకు పాల్పడిన 6గురు యువకుకు కోర్టు శిక్ష జరిమానా విధించి నట్లు దేవరకొండ సీఐ నరసింహులు తెలిపారు. యాదాద్రి జిల్లా భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన రాకేష్, నవీన్, శివారెడ్డి, రాజేందర్, సందీప్ రెడ్డి, శివారెడ్డి మంగళవారం సాయంత్రం దేవరకొండ పట్టణంలో ముదిగొండ రోడ్డులో మద్యం తాగి ఘర్షణకు దిగి న్యూసెన్స్ చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ తరలించారు. ఆరుగురు యువ కులకు సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పొట్ట చెన్నయ్య రూ.6000 జరిమానా, సోషల్ సర్వీస్ కింద ఒక్క రోజు కోర్టు ఆవరణలో పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

భక్తిమార్గాన్ని అనుసరించాలి : కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గీతా జయంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సావర్కర్ నగర్ బసవేశ్వర భవన్ ఏర్పాటు చేసిన గీతా జయంతి కార్యక్రమాలనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నేటి యువతకు హిందూ ధర్మాన్ని ప్రబోధించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

చండూరు: భగవద్గీత జయంతి సందర్భంగా బుధవారం చండూరులోని స్థానిక ఉమా మహేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భగద్గీత సేవా సమితి అధ్యక్షుడు తాడిశెట్టి యాదయ్య, బుర్రి లింగారెడ్డి, సోమ బిక్షమయ్య, తేలుకుంట్ల చంద్రయ్య, కోమటి వీరేశం, తాడిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలు

- తుది వీడ్కోలుకు అష్టకష్టాలు
- సౌకర్యాల లేమితో ఇబ్బందులు
- కంపచెట్లతో నిండిపోయిన శ్మశానవాటికలు
- పట్టించుకోని అధికారులు



పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో కంపచెట్ల మధ్యే దహన సంస్కారాలు

మనిషి జీవితం ముగిసిన తర్వాత, ఆ మృతదేహాన్ని కాల్చేందుకు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. నల్లగొండ జిల్లా కేంద్రంలో శ్మశానవాటికలు సమస్యలకు నిలయాలుగా మారింది. వైకుంఠధామాల్లో మృతదేహాన్ని దహనానికైనా, ఖననానికైనా కుటుంబసభ్యులు, బంధువులు పడరాని పాట్లు పడుతున్నారు. శ్మశానవాటికల్లో కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. అంతేకాకుండా ఒకే సమయంలో రెండు అంతకన్న ఎక్కువ మృతదేహాలు వచ్చినప్పుడు అంత్యక్రియలు చేయలేక అనేక అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే మృతదేహాలను దహనం చేసే సమయంలో తమ ఇళ్లలోకి పొగ వస్తోందని పలువురు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్)

ఈ శ్మశానవాటికల్లో మృతదేహాల అంత్యక్రియలకు పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలోని శ్మశానవాటిక సమస్యలకు నిలయంగా మారింది. ఈ శ్మశానవాటిక సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నా మృతదేహాలకు అంత్యక్రియలు చేయడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.

వసతులు కరువు

నల్లగొండ పట్టణ పరిధిలో సుమారు పది శ్మశానవాటికలు ఉన్నాయి. అన్ని సమస్యలకు నిలయాలుగా మారాయి. కొన్ని శ్మశానవాటికల్లో పెద్ద ఎత్తున కంప చెట్లు పెరగడంతో దహన కార్యక్రమాలకు ఆటంకంగా మారింది. దహన కార్యక్రమాలు ముగిశాక స్నానాలు చేయడానికి నీటి సౌకర్యం లేక మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న వాటిల్లో ఎప్పటి నుంచి నాచు, మురికి నీరు ఉండటంతో వాటిని వినియోగించడానికి ఇబ్బంది పడుతున్నారు. కొన్ని శ్మశానవాటికల్లో బోరు ఏర్పాటు చేసినా కరెంట్ సరఫరా లేక నిరుపయోగంగా మారాయి. కరెంటు, నీళ్లు ఉన్న మరుభూమిలో మోటారు పనిచేయని పరిస్థితి. దీంతో నీటిని ట్యాంకుల ద్వారా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నల్లగొండ పట్టణంలో ఇదీ పరిస్థితి

నల్లగొండ పట్టణ పరిధిలోని దేవరకొండ రోడ్డు, పాత బస్తీ పరిధిలో రెండు, మిర్యాలగూడ రోడ్డు, పానగల్ రోడ్డులో రెండు, హైదరాబాద్ రోడ్డు, మర్రిగూడెం పరిధిలో, చర్లపల్లి పరిధిలో, ఆర్జాలబావిలో శ్మశానవాటికలు ఉన్నాయి. పానగల్ పరిధిలోని శ్మశానవాటికల్లో కంపచెట్లు పెరిగి మృతదేహాలను దహనం చేసే పరిస్థితి లేదు. అదే విధంగా బీఎస్ఎన్ఎల్ సమీపంలోని శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేసే విధంగా లేకపోవడంతో అక్కడికి వచ్చిన వారి బంధువులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని శ్మశానవాటికల్లో చెత్తాచెదారం పేరుకపోయి, నీటి సౌకర్యం కూడా లేదు. వసతులు లేక, మురికినీరు పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. అదే విధంగా నీటి సమస్యలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా దశదినకర్మ కార్యక్రమంలో కర్మకాండల అనంతరం జుట్టు కత్తిరించుకునేందుకు కూడా వసతులు కరువయ్యాయి. ఉన్న చోట అపరిశుభ్రత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పట్టణంలోని శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

భయానకంగా శ్మశానవాటికలు

శ్మశానవాటికల్లో కంపచెట్లు, చెత్తాచెదారంతో నిండిపోయి భయానకంగా మారింది. చెట్లు విపరీతంగా పెరగడంతో ఆ పొదల నుంచి పాములు, ఇతర హానికరమైన కీటకాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అవి ఇళ్లల్లోకి వస్తుండటంతో పిల్లలు, మహిళలు, పెద్దలు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వాలు ప్రజల సౌకర్యార్థం కోట్లు ఖర్చు చేస్తున్నా అవి ప్రజలకు అందడంలో నిర్లక్ష్యం జరుగుతుంది. ఈ శ్మశానవాటిక సౌకర్యాలు కల్పించాలని అనేక మార్లు మునిసిపల్ అధికారులకు కాలనీవాసులు, ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. శ్మశానవాటికలో పేరుకుపోయిన కంపచెట్లను తొలగించి, విద్యుత్ యంత్రాలను ఏర్పాటు చేయాలని, దీనివల్ల పొగ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

భయపడుతూ అంత్యక్రియలు



శ్మశానవాటికలో పెద్ద ఎత్తున చెట్లు ఉండటంతో నిత్యం విషపురుగులు, ఇతర కీటకాలు ఇళ్లల్లోకి చేరుతున్నాయి. కంప చెట్లు గుబురుగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు నిలయంగా మారుతుంది. రెండేళ్ల క్రితం ఒక హత్య కూడా జరిగింది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు కంప చెట్లను తొలగించి, విద్యుత్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలి. అదే విధంగా శ్మశానవాటికల్లో పూల మొక్కలు, ఇతర చెట్లను పెంచితే బాగుంటుంది.

- పగిడి మహేష్, శ్రీనగర్ కాలనీ

కాలనీలోకి పెద్ద ఎత్తున పొగ వస్తుంది



శ్మశానవాటికలో మృతదేహాలను కాల్చినప్పుడు ఇళ్లల్లోకి పెద్ద ఎత్తున పొగ చేరుతుంది. దీంతో పిల్లలు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకే సారి ఎక్కువ మృతదేహాలు వచ్చినప్పుడు వాటిని దహనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ దహన యంత్రాన్ని ఏర్పాటు చేయాలి. శ్మశానవాటికలో పెరిగిన కంప చెట్లను తొలగించి మొక్కలను నాటాలి.

- మంగిపల్లి కిషన్, శ్రీనగర్ కాలనీ

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



నల్లగొండ మునిసిపల్ పరిధిలో గల శ్మశానవాటికల్లో వాటికల్లో సమస్యలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయిస్తా. సమస్యలు ఉన్నచోట వాటిని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తా. పట్టణ అభివృద్ధికి పాలకవర్గం సహకారంతో కృషి చేస్తా.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని విద్యుత్ లైన్‌లకు అడ్డుగా చెట్లను తొలగించే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాకు నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎం.వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని హనుమాన్‌నగర్, శివాజీనగర్, గాంధీనగర్, శ్రీనగర్‌కాలనీ, శివరాంకాలనీ, వైకుంఠపురం, అమూల్యకాలనీ, సావర్కర్‌నగర్, ఎన్‌జీవోస్ కాలనీ, వీటి కాలనీ, విద్యుత్‌నగర్, తిరుమలనగర్, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

వసంతకు డాక్టరేట్



ప్రొఫెసర్. వసంత

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ప్రభుత్వ మహిళా కళాశాలలో రసాయశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎ. వసంతకు రసాయన శాస్త్ర విభాగంలో ఓయూ పీహెచ్‌డీ పట్టా అందజేసింది. సూర్యకాంతి, దృగ్గోచర కాంతి అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించినందుకు డాక్టరేట్ అందజేశారు. వసంతకు డాక్టరేట్ రావడంపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, అధ్యాపకులు సాలయ్య, సుభాష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

నార్కట్‌పల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నార్కట్‌పల్లి మండల ప్రత్యేకాధికారి చరిత బుధవారం పరిశీలించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద సర్వే సిబ్బంది, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి చేస్తున్న క్షేత్రస్థాయి సర్వే తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రామాణికంగా చేస్తున్న ఈ సర్వేను సమర్థంగా చేయాలని ఆమె సూచించారు. ఎంపీడీవో కె.ఉమేష్, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సుభాన్ తదితరులు ఉన్నారు.

వరి కొయ్యలు నేలలో కలియదున్నాలి



కొప్పోలులో రైతులతో మాట్లాడుతున్న ఏవో పురుషోత్తం

కేతేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంట కోతల తర్వాత వరి కొయ్యలను కాల్చకుండా నేలలో కలియదున్నడం రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం అన్నారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో రైతులతో మాట్లాడి వరి కొయ్యలు నేలలో కలియదున్నడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చడం వల్ల నేలకు, పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు, వానపాములు, సూక్ష్మజీవులు చనిపోయి భూసారం తగ్గుతుందని అన్నారు. వరి కొయ్యలు సత్వరం భూమిలో కలిసి పోయేందుకు దుక్కికి ముందు ఎస్ఎస్‌పీ ఎరువును ఎకరాకు రెండు బస్తాలు చల్లుకోవాలని ఆయన రైతులకు సూచించారు. సమావేశంలో ఏఈవో ఉమేష్, రైతులు ఉపేందర్‌రెడ్డి, లింగయ్య, రమేష్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ తల్లి విగ్రహంపై రాద్ధాంతం తగదు'

మర్రిగూడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్ఎస్ పార్టీ రాద్ధాంతం చేస్తోందని, ఇది తగదని ఆదివాసీ గిరిజన రాష్ట్ర కమిటీ సభ్యుడు రమావత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మర్రిగూడలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయం ఎదుట తెలంగాణ తల్లిని ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఇది కాంగ్రెస్ తల్లి విగ్రహం అనడం తగదన్నారు. తెలంగాణ విగ్రహం తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించినదని, తెలంగాణ తల్లికి ఆభరణాలు అవసరం లేదని అన్నారు. తల్లిని తల్లిగానే చూడాలని అన్నారు. తెలంగాణ తల్లికి విగ్రహం ఏర్పాటుకు సానుకూలంగా ఉండాలని అన్నారు. సమావేశంలో నాయకులు రవీందర్‌నాయక్, పంత్‌నాయక్, గోవర్ధననాయక్, బీమానాయక్ పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

మర్రిగూడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు, ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను అందించాలని మండల విద్యాధికారి బిట్టు శ్రీనివాస్ అన్నారు. మర్రిగూడ మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నెలవారీ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు కాంప్లెక్స్ పరిధిలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు భాషా, గణిత, సామర్థ్యాల బోధనపై శిక్షణ ఇచ్చారు. ప్రతి పాఠ్యాంశాన్ని కృత్యాధార బోధన చేయాలని, ప్రతి విద్యార్థుల్లో భాషా, గణిత సామర్థ్యాలను పెంచాలని సూచించారు. సమావేశంలో హెచ్ఎం శ్రీనివాస్, శారద, మాలతి ఉదావత్ లచ్చిరాం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారికి రిమాండ్

నార్కట్‌పల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మంత్రాల నెపంతో దాడి చేసిన వ్యక్తితో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఏనుగుతల దయాకర్ ఝాన్సీ కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. అయితే ఇదే గ్రామానికి చెందిన బెక్కంటి పుల్లమ్మ అనే వృద్ధురాలు మంత్రాలు చేయడంతో తన భార్య ఝాన్సీ అనారోగ్యానికి గురైనట్లు భావించారు. పుల్లమ్మను చంపితేనే ఝాన్సీ ఆరోగ్యంగా కోలుకుంటుందని నమ్మారు. దయాకర్‌తో పాటు అతని తండ్రి నర్సింహ, తల్లి జయమ్మ, మామ మిడిదొడ్డి సత్తయ్య కలిసి ఈ నెల 7వ తేదీన బెక్కంటి పుల్లమ్మ ఇంటికి వెళ్లారు. ఝాన్సీ అనారోగ్యానికి కారణమైన నిన్ను అంతం చేస్తామని బెదిరించారు. ఇందులో భాగంగానే ఈ నెల 9వ తేదీన బెక్కంటి పుల్లమ్మ కూలీ పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా పథకం ప్రకారం అప్పటికే వేచి ఉన్న దయాకర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో పుల్లమ్మపై దాడి చేశాడు. అంతలోనే పుల్లమ్మ భర్త యాదయ్య అక్కడికి రావడం చూసిన దయాకర్ పారిపోయాడు. బాధితురాలు పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి దయాకర్‌తో పాటు మిగతా ముగ్గురు కుటుంబ సభ్యులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు వారు వివరించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

నల్లగొండకల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో బుధవారం అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బాలరాజు, మనోహర్ గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పడిపూజలో స్వామివారి విగ్రహాన్ని నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చెరుకు వినోద్‌కుమార్, ప్రీతి, సోమ వెంకటేశ్వర్లు, పద్మావతి, మాదవి, వెంకన్న, ద్రోణ్‌కుమార్, రమా, వాగ్దేవి, మాధవి, కవిత, సంధ్య, ధనయ్య, సందీప్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి: నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

ఆకట్టుకున్న అయ్యప్ప నగర సంకీర్తన

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ 23వ మహా మండల పడిపూజ ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అయ్యప్పస్వాములు నగర సంకీర్తన కార్యక్రమం పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకుంది. పట్టణంలోని శివాలయం వద్ద ఉన్న బొడ్రాయి నుంచి ప్రారంభమైన నగర సంకీర్తనలో అయ్యప్ప మాలధారులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం గురుస్వామి గనగాని నర్సింహనిర్మల దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఆలయ చైర్మన్ గురుస్వామి బెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మీడియా సిబ్బందిపై మోహన్‌బాబు దాడి హేయం



నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు

నల్లగొండటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సినీనటుడు మంచు మోహన్‌బాబు మీడియాపై చేసిన దాడిని పలు జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం వివిధ జర్నలిస్టు సంఘాలు, ప్రెస్‌క్లబ్‌ల ఆధర్యంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో మీడియా ప్రతినిధులు, జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రెస్‌క్లబ్ సంఘాల బాధ్యులు మాట్లాడుతూ సమాజంలో సినీనటునిగా పేరు ప్రఖ్యాతలు కలిగిన మోహన్‌బాబు తన కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామాలతో సహనం కోల్పోయి మీడియాపై దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. అనుచిత ప్రవర్తనతో ఆదమరిచి మీడియాపైనే దాడి చేసిన మోహన్‌బాబుపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆయన్ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, చిన్న పత్రికల జర్నలిస్టులతో పాటు సీనియర్ జర్నలిస్టులు, సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలి



శాలిగౌరారం: సీఎం కప్ క్రీడోత్సవాల్లో కబడ్డీ జట్టు

శాలిగౌరారం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు చామల జైపాల్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని శాలిగౌరారంలోని జడ్పీ హైస్కూల్‌లో సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సీఎం కప్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేష్‌గౌడ్, జిల్లా నాయకులు చింత ధనుంజయ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్, నాయకులు సిరందాస్ రాజు, బొల్లికొండ సందీప్, హరినాగరాజు, వేముల భరత్, సాయి, నితిన్, సాయి, హెచ్ఎం మల్లయ్య, పీడీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండలస్థాయిలో ఈ నెల 13వ తేదీన జరిగే సీఎం కప్ ఆటల పోటీలను జయప్రదం చేయాలని ఎంపీడీవో జయరాం కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సీఎం కప్ నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం కప్‌లో భాగంగా కనగల్ మోడల్ స్కూల్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతి, యువకులు ఆయా పాఠశాలల పీడీలను లేదా మోడల్ స్కూల్‌లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. యువకులు సీఎం కప్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని అన్నారు. సమావేశంలో ఎంఈవో పద్మ, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మర్రిగూడ : మర్రిగూడ మండలంలోని సరంపేట పరిధిలోని ఖర్షగడ్డ కాలనీలో బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించి 5.5లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, కేసు నమోదు అవుతుందని వారు అన్నారు.

చిట్యాల: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాల జాబితా ఈ నెల 7వ తేదీన విడుదల చేసింది. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే చర్చించేందుకు ఈ నెల 12న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

శాలిగౌరారం : శాలిగౌరారం మండల ఐకేపీ ఏపీఎం ఎరుకల జానకి నల్లగొండ డీఆర్‌డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. కేతేపల్లి ఐకేపీ ఏపీఎం యాదమ్మను శాలిగౌరారం మండల ఏకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా నియమించారు.

చిట్యాల: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వవద్దని ఎస్సీ వర్గీకరణ కమీటీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ ఎండీ.షమీమ్‌అక్తర్‌కు ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ బుధవారం వినతిపత్రం ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను మన రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు.

మునుగోడు: తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమిని గ్రామాల్లో బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కూటమి జిల్లా ఇన్‌చార్జి గోసంగి శ్రీను పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కనగల్ : కనగల్ హైస్కూల్‌లో మండల స్థాయి పాఠశాల విద్యార్థులకు మ్యాథ్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. కనగల్ హైస్కూల్ విద్యార్థి కోరె లక్ష్మణ్, జీఎడవల్లి హైస్కూల్ విద్యార్థిని పి.యమున, కురంపల్లి హైస్కూల్ విద్యార్థి పి.శ్రీకాంత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

శాలిగౌరారం: ఓబీసీ హక్కుల సాధనే లక్ష్యంగా బీసీలందరూ పోరాటం చేయాలని ఓబీసీ డాక్టర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సమర శంఖారావం సదస్సులో ఆయన మాట్లాడారు.

నల్లగొండ టౌన్: కాలనీ రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణంలోని సూర్యానగర్ కాలనీ మూడోలైన్ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాలనీ వాసులు బుధవారం ఆక్రమిత రోడ్డు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎ.హరిత, జి.సుగుణ, కె.హరిత తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని అన్ని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు విద్యాశాఖ, గణిత ఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంగ్లీష్ మీడియంలో వెలిమినేడు పాఠశాలకు చెందిన ఎస్. శివకార్తీక్, గుండ్రాంపల్లికి చెందిన అక్షిత, శిరీష, నేరడకు చెందిన శృతి, అభినయశ్రీ అలాగే తెలుగు మీడియంలో వనిపాకల పాఠశాలకు చెందిన బి.మల్లేష్, హరిణి, ధనలక్ష్మి చిట్యాలకు చెందిన ఇరగదిండ్ల గణేష్ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాధికారి పొనుగోతు సైదానాయక్ తెలిపారు.

పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కోటంరాజు

నల్లగొండ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్‌లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. కోటం రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పవద్దని సూచించారు. బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులోని రూ.5500 కోట్ల నిధులు ఉన్నాయని, వాటిని కార్మికుల సంక్షేమానికి కాకుండా వారికి ఇష్టం వచ్చినట్లుగా దుబారా ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లపై దాడులు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లపై ప్రభుత్వం చేసిన దాడులు సరికాదని, బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని, గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మరోవైపు క్షేత్రస్థాయిలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆశావర్కర్లపై దాడులు సరైందికాదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఆశా వర్కర్లకు కేవలం రూ. 1500 మాత్రమే ఉండేదని, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.10వేలు గౌరవ వేతనం పెంచి వారి సేవలు గుర్తించి గౌరవించినట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సిలివేరు ప్రభాకర్, కొప్పుల ప్రదీప్‌రెడ్డి, ప్రగడపు నవీన్‌రావు, కౌన్సిలర్ పల్లె విజయ్, గుర్రం గణేష్, యానాల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే తెలంగాణ అభివృద్ధి'

మర్రిగూడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీడీపీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని అన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకన్న, పుప్పాల యాదయ్య, ముద్దపు శ్రీనివాస్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'భోజన కార్మికుల వేతనం పెంచాలి'

నల్లగొండరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని పానగల్ ప్రభుత్వ పాఠశాలలో సీఐటీయూ బృందం మధ్యాహ్న భోజన కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు వేతనం పెంచుతూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అద్దంకి నర్సింహ, అల్లి అనురాధ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుచేయాలి

చిట్యాలరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలయాపన లేకుండా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చేకూరి గణేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముడిగొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నల్లగొండ కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ చేపటేందుకు వచ్చిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్‌అక్తర్‌కు బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిషన్‌తో కాలయాపన చేయకుండా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసే ప్రతి నోటిఫికేషన్‌కూ వర్తింపజేయాలని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అందుగుల ఆనంద్, నారపాక అంజి, ఏర్పుల రాకేష్ ఉన్నారు.

టీచర్ల పెండింగ్ బకాయిలను చెల్లించాలి

మర్రిగూడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని, డీఏలను మంజూరు చేయాలని ట్రైబల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదావత్ లచ్చిరాం, జాయింట్ సెక్రటరీ సభావత్ వెంకట్ కుమార్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిసంఘం సభ్యత్వ నమోదును వారు ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. మండల అధ్యక్షుడు రమావత్ విఠల్, ప్రధాన కార్యదర్శి నేనావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, తిరుపతయ్య, లక్‌పతి, ప్రియాంక పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	185	205
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 22.6

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు
విన్నపాల వెల్లువ

- కలెక్టరేట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అభిప్రాయసేకరణ
- హాజరైన చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్
- అభిప్రాయాలను రాతపూర్వకంగా చైర్మన్‌కు అందజేసిన కుల సంఘాలు, మేధావులు, పార్టీల విభాగాలు
- అన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించనున్న చైర్మన్



నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌కు వినతులు, సూచనలు వెల్లువెత్తాయి. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కమిషన్ చైర్మన్, జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ అభిప్రాయ సేకరణ చేపట్టారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ కులాల సంఘాలు, ఉద్యమనాయకులు, పలువురు మేధావులు వారి అభిప్రాయాలను, సూచనలను కమిషన్ చైర్మన్‌కు లిఖితపూర్వకంగా అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న కమిషన్ ఈ సూచనలు, అభిప్రాయాలు, వినతిపత్రాలను, వాస్తవిక స్థితిగతులను అధ్యయనం చేసిన అనంతరం వర్గీకరణపై సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయనుంది. దీంతో ఎస్సీ కులాలు, ఉపకులాలకు చెందిన పలు సంఘాలు, నాయకులు, వేదికల తరపున కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు సూచనలు, విన్నపాలు అందజేశారు. ● వివరాలు 6లో..

వంటింట్లో ధరల మంట

నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నెల క్రితం కిలో కూరగాయల ధరలు రూ.50లోపు ఉండగా, ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 వరకు పెరిగింది. గుడ్డు ధర రూ.5 నుంచి రూ.7కు పెరిగింది. బియ్యం క్వింటా రూ.5,500 నుంచి రూ.6,800 పెరిగింది. వీటితోపాటు వెల్లుల్లి, అల్లం, ఉల్లి, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల ధరలు గత నెలతో పోల్చితే 100 శాతం పెరిగాయి. నవంబరులో కూరగాయలపై రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఖర్చు చేస్తే, డిసెంబరు వచ్చేసరికి రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ధరాభారంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.

● ఆంధ్రజ్యోతి, కోదాడ



నెలకు రూ.10వేల వరకు అదనపు ఖర్చు

నాలుగు నెలల క్రితం నెలకు సరిపడా సరుకులకు రూ.8వేల నుంచి రూ.10వేలు ఖర్చుచేసేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి కన్పించడం లేదు. కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరగడంతో అదనంగా నెలకు రూ.5వేల నుంచి రూ.10వేలు మొత్తంగా రూ.20వేల వరకు ఖర్చు వస్తోంది. ఉద్యోగులు, రైతులు, కష్టజీవుల వేతనాలు కూరగాయల, నిత్యావసరాల ధరలు పెరిగినంతగా పెరగవు. దీంతో ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక అప్పులు చేస్తున్నాం. పెరుగుతున్న కూరగాయల, నిత్యావసరాల ధరలను ప్రభుత్వం నియంత్రించి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి.

పి.భాగ్యమ్మ, గృహిణి, కోదాడ

కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	ఆరు నెలల క్రితం (మే)	నెల క్రితం (కిలో. రూ.లో)	ప్రస్తుతం
ఆలుగడ్డ	15	30	65
దొండ	20	35	85
వంకాయ	15	45	80
దోస	22	40	80
బెండకాయ	18	20	55
మిర్చి	30	40	90
బీరకాయ	20	35	80
కాకరకాయ	35	40	80
గోరుచిక్కుడు	30	40	60
చిక్కుడు	50	80	120
క్యారెట్	25	40	60
టమాటా	14	80	20

నిత్యావసరాల ధరలు ఇలా..

సరుకులు	నెల క్రితం (కిలో రూ.లో)	ప్రస్తుతం
బియ్యం	55	68
నూనె	112	140
కొబ్బరిపొడి	200	330
పంచదార	40	55
గోధుమరవ్వ	40	55
కందిపప్పు	170	190
పెసరపప్పు	70	95
శనగపప్పు	50	70
ఉల్లిగడ్డలు	50	70
ఎల్లిపాయలు	360	450
ఇడ్లీరవ్వ	30	50
గుడ్లు (30)	150	210

- పోటీ పడుతున్న నిత్యావసరాలు
- రెండింతలైన కూరగాయల ధరలు
- అదే బాటలో గుడ్డు
- పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.90కి పెరుగుదల
- గుడ్డు రూ.7, బియ్యం క్వింటా రూ.6,800
- కూరగాయల సాగు తగ్గడం, డిమాండ్ పెరగడం, కృత్రిమ కొరత ధరల పెరుగుదలకు కారణం

ధరాభారంతో ఆదాయానికి ఖర్చుకు పొంతన ఉండటం లేదు. దీంతో నెల తిరగక ముందే అప్పు చేయాల్సి వస్తోందని పేద, మధ్యతరగతి ప్రజలు వర్గాలు వాపోతున్నారు. ధరలు పెరగడంతో నెలనెలా వచ్చే వేతనంతో కుటుంబం నెట్టుకురావడం భారంగా మారింది. కూరగాయలతోపాటు బియ్యం, ఉల్లి ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నిన్న, మొన్నటి వరకు కిలో రూ.80 ఉన్న టమాటా ధర రూ.20కి తగ్గటం కాస్త ఉపశమనం కలిగించింది.

తగ్గిన దిగుబడి, కృత్రిమ కొరత

ఉమ్మడి జిల్లాలో ఆయకట్టు ప్రాంతమైన సాగర్, మిర్యాలగూడ, హాలియా, హుజూర్‌నగర్, కోదాడ, నడిగూడెం మండలాల్లో అత్యధికంగా వరి సాగవుతోంది. నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లో కూరగాయలు, నిమ్మ, జామ, మామిడి, బత్తాయి తోటలు సాగవుతున్నాయి. నాన్‌ఆయకట్టు రైతులు సైతం బోరు బావుల కింద వరి సాగు చేపట్టడంతో కూరగాయల సాగు తగ్గింది. దీంతో దిగుబడి తగ్గడం, డిమాండ్ పెరగడం, కూరగాయల కృత్రిమ కొరత సృష్టించడంతో ధరలు పెరిగాయి. కూరగాయలతో పాటు చికెన్, మటన్, గుడ్డు ధరలు కూడా పెరగడంతో ప్రత్యామ్నాయం లేక వినియోగదారులు కూరగాయల బాటే పడుతున్నారు. గత ఏడాది మూడు ఎకరాల్లో మిగతా 7వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటి సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి సర్వేను అధికారులు వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి సూచించారు. బుధవారం అనుముల మండలంలోని మదారిగూడెం, కొత్తపల్లి, హాలియా మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు, 12వ వార్డులో ఇందిరమ్మ ఇంటి సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా పాలనలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబిత ప్రకారం పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. అర్హుల వివరాలు, వారి ఇంటి పరిస్థితిని పరిశీలించి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటికి వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు సహకరించి సంబంధిత వివరాలు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో ప్రధానంగా బీపీఎల్ పరిధిలో ఉన్న కుటుంబమై ఉండి, ఇళ్లు లేకుండా ఉండాలన్నారు. ఇంటి స్థలానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు ఉన్న వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, మున్సిపాలిటీ మేనేజర్ రషీద్, సిబ్బంది మట్టపల్లి, వార్డు ఆఫీసర్లు, తదితరులు ఉన్నారు.

నకిరేకల్ మార్కెట్ చైర్మన్‌గా మంజుల

నూతన పాలకవర్గం నియామకం



కేతేపల్లి, డిసెంబరు 11: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం ఎట్టకేలకు ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం జీవో 882ను జారీచేసి మార్కెట్ పాలకవర్గాన్ని ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుత్తా మంజులను ప్రభుత్వం ఖరారు చేసింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక బీఆర్ఎస్ హయాంలో ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దయింది. నాటి నుంచి ఏడాదికాలం మార్కెట్‌కు పాలకవర్గం లేకుండానే గడిచింది. నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి మండలాల పరిధిలో ఏటా రూ.5కోట్లకు పైగా ఆదాయంతో పాటు రాష్ట్రంలోనే ఏకైక నిమ్మ మార్కెట్ యార్డు ఉన్న ఈ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల స్థానాలకు ప్రాధాన్యం ఏర్పడింది. చైర్మన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించగా, చైర్మన్‌తో పాటు పాలకవర్గ నియామకానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్ మండలాలకు చెందిన పార్టీ నాయకులతో చర్చించారు. ఆ తరువాత పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు రెండేళ్ల కాల పరిమితితో పాలకవర్గ చైర్మన్‌గా కేతేపల్లి మాజీ ఎంపీపీ గుత్తా మంజుల మాధవరెడ్డిని, వైస్ చైర్మన్‌గా నకిరేకల్ మండలంలోని ఓగోడు గ్రామ మాజీ సర్పంచ్ దూలం సోమయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఈ 16మంది డైరెక్టర్లుగా కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామానికి చెందిన పుట్ట నర్సింహారెడ్డి, పామనగుండ్లకు చెందిన బండారు కృష్ణయ్య, కట్టంగూర్‌కు చెందిన గుండు పరమేష్, కేతేపల్లి మండలంలోని గుడివాడకు చెందిన షేక్ లతీఫ్, కొప్పోలుకు చెందిన కప్పల సైదులు, కేతేపల్లికి చెందిన బయ్య ముత్తయ్య, మాందాసు పరశురాములు, నకిరేకల్ మండలానికి చెందిన బొల్లెద్దు లక్ష్మయ్య, మొగిలి బుచ్చమ్మను నియమించింది.

రూ.100కోట్ల డిపాజిట్లు సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకు పరిధిలో 90 రోజుల్లో రూ.100కోట్ల డిపాజిట్ల సేకరణ పూర్తి చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో నిర్వహించిన మేనేజర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు మొదటి వారంలో ప్రారంభమైన ఈ డిపాజిట్ల సేకరణ మాసోత్సవం సంతృప్తికరంగా ఉందన్నారు. ఇప్పటికే రూ.42కోట్ల డిపాజిట్లను సేకరించడంపై అధికారులను, ఉద్యోగులను, సొసైటీ చైర్మన్లను అభినందించారు. సహకార సమృద్ధి డిపాజిట్ పథకంతో పాటు సహకార లక్ష్మి పథకానికి సైతం డిపాజిట్లను చేపట్టాలన్నారు. రానున్న కొద్ది రోజుల్లో రూ.100కోట్ల డిపాజిట్లను సేకరించడం ద్వారా సహకార బ్యాంకుల అభివృద్ధికి ప్రతి కృషి చేయాలన్నారు. అదేవిధంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేయాలని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీలు, బ్యాంకులు పనిచేయాలని సూచించారు. వాణిజ్య బాంకులకు దీటుగా సహకార బ్యాంకులను అత్యున్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వ్యాపారం రూ.2,300కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.2,660కోట్లకు చేరిందన్నారు. రానున్న రోజుల్లో రూ.3 వేల కోట్ల లక్ష్యాన్ని విధిస్తున్నామన్నారు. పంట రుణాలను రూ.లక్ష నుంచి రూ.1.50లక్షకు పెంచామన్నారు. ఎన్ఎల్ఎం పథకం కింద 50శాతం సబ్సిడీతో గొర్రెలు, నాటుకోళ్ల పెంపకానికి సబ్సిడీ ఇస్తామని చెప్పారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో రావులపాటి శంకర్‌రావు, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, కొండ సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



అలుగు పోస్తున్న కేతేపల్లి విమ్మలమ్మ చెరువు

● **అలుగుపోస్తున్న తటాకాలు**

కేతేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వర్షాకాలం నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు ఏఎమ్మార్పీ, మూసీ కుడికాల్వ ద్వారా చెరువులు, కుంటలకు నీరు చేరింది. వర్షం నీటితో కొంతమేర నిండి ఉన్న ఆయా చెరువులకు మూసీ, ఏఎమ్మార్పీ నీరు చేరడంతో చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి.

వారంరోజులుగా ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు అయిటిపాముల చెరువు నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మండల పరిధిలోని ఏఎమ్మార్పీ ఆయకట్టు చెరువులకు నీరు చేరుతోంది. ఏఎమ్మార్పీ డీ49 కాల్వ నీటితో మండలంలో ఆయకట్టేతర గ్రామాలుగా ఉన్న ఇనుపాముల, గుడివాడ, బండపాలెం, కొండకిందిగూడెం, కేతేపల్లి, కొర్లపహాడ్ గ్రామాలకు చెందిన చెరువులు కుంటలు నిండాయి. మరోవైపు మూసీ కుడికాల్వకు విడుదలయ్యే నీటితో ఆయకట్టులోని కాసనగోడు, బొప్పారం, కొత్తపేట, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, తుంగతుర్తి, కొప్పోలు, చెరుకుపల్లి గ్రామాలకు చెందిన చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయి. యాసంగి సీజన్‌కు ముందు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడంతో ఆయా గ్రామాల చెరువుల ఆయకట్టుతో పాటు వ్యవసాయ బావులు, బోర్ల నీటితో యాసంగి పంటలు సాగు చేసే రైతులు సాగుపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉండటంతో వచ్చే వేసవిలో తమ గ్రామాల్లో తాగు నీటి సమస్య కూడా తగ్గుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్మోగిన అయ్యప్ప

శరణుఘోష





గిరి ప్రదక్షిణలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

7

వడ్డీభారం లేని రుణం
ఎంతో ప్రయోజనం

- కర్నాటక సొసైటీల్లో అధ్యయనం
- అధ్యయన యాత్రలో అనేక విషయాలపై అవగాహన
- ఉమ్మడి జిల్లాలో అదనంగా మరో 50 సొసైటీలు
- రైతుల సంక్షేమం, సొసైటీల బలోపేతమే లక్ష్యం 7



మినీ ట్యాంక్‌బండ్ పూర్తయ్యేనా..?

- తొమ్మిదేళ్ల క్రితం పనులు ప్రారంభం
- త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి



చెరువు ఒడ్డున మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంలో భాగంగా పోసిన కట్ట

మినీ ట్యాంక్‌బండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన లోగో (ఇన్‌సెట్‌లో)

ట్యాంక్ బండ్ ఒకప్పుడు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కే పరిమితమై ఉండేది. అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలకు సమీపంలో ఉన్న చెరువులు, ఆనకట్టలు, నీటి వనరులున్న ప్రాంతాలను మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా నిధులు మంజూరు చేయడంతో కొన్ని ప్రాంతాల్లో పూర్తి కాగా మరికొన్ని మధ్యలోనే నిలిచిపోయాయి.
-(మిర్యాలగూడ టౌన్ - ఆంధ్రజ్యోతి)

మిర్యాలగూడ పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు తలపెట్టిన మినీ ట్యాంక్‌బండ్ పనులు తొమ్మిదేళ్లుగా సాగు తూనే ఉన్నాయి. పట్టణంలోని చైతన్యనగర్‌లో పందిళ్లపల్లి చెరువు ఒడ్డున 2015లో రూ.6.70 కోట్లతో ఆరంభించిన పను లు నేటికీ పూర్తి కాలేదు. చెరువు ఒడ్డున కొలువుదీరిన ఉమామహేశ్వరాలయం నుంచి నల్లగొండ ప్రధాన రహదారి వర కు పనులను నీటి పారుదల శాఖకు అప్పగించారు. ట్యాంక్‌బండ్ తరహాలో మినీ ట్యాంక్ బండ్‌కు ఇరువైపులా చెట్లు, వాకింగ్ ట్రాక్, మినీ పార్కులు నిర్మించేందుకు మరో రూ. 7 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. చెరువు ఒడ్డున బతుకమ్మ ఘాట్లను సైతం నిర్మించేందుకు పనులు ప్రారంభించారు.

అడ్డంకులెన్నో...

పట్టణంలో తలపెట్టిన మినీ ట్యాంక్‌బండ్ పనులకు అడ్డం కులెన్నో ఉన్నాయి. కొందరు రైతులు తమ భూములు ఉమా మహేశ్వరాలయం నుంచి నల్లగొండ ప్రధాన రహదారి వర కు మినీట్యాంక్ బండ్ కట్టలో పోతున్నాయని కోర్టును ఆశ్రయించగా కొంతకాలం పనులు నిలిచిపోయాయి. తదన ంతరం పనులు ప్రారంభించి మట్టి రహదారి నిర్మించారు. నీటి పార ుదల శాఖ పనులు దాదాపు పూర్తవ్వగా.. మునిసి పల్ శాఖ పనులు మొదలవ్వాల్సిన తరుణంలో నిధుల కొరత వచ్చిప డింది

పనులు పూర్తి చేయాలి



పట్టణంలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. మట్టితో రోడ్డు పోసి వదిలేశారు. వర్షాకాలంలో మట్టంతా కొట్టుకు పోవ డంతో పాటు బురదమయంగా ఉంటుంది. మట్టితో పోసిన చెరువు కట్టపై నడక ఇబ్బందిగా ఉంది. కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నా వాకింగ్‌కు అనువుగా లేకపోవడంతో ప్రభుత్వ కళాశాల, ఎన్సీసీ క్యాంపు మైదానాలకు వెళ్లి వాకింగ్ చేయాల్సి వస్తోంది. పనులు పూర్తి చేయాలి.
-శీలం శ్రీరామ్, ఎల్ఐసీ ఉద్యోగి, చైతన్యనగర్

త్వరలో పునఃప్రారంభిస్తాం



మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. నిధుల కొరతతో నిలిచిన పనులను త్వరలో పునఃప్రారంభిస్తాం. అమృత్, పబ్లిక్ హెల్త్ శాఖల సహకారంతో పట్టణాభివృద్ధి కోసం పలు ప్రణాళికలు రూపొందించాం. అందులో కొన్ని ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం
- ఎండీ. యూసుఫ్, కమిషనర్, మిర్యాలగూడ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వ భూముల ఆక్రమిస్తే చర్యలు

రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ



ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి హెచ్చరించారు. భూముల ఆక్రమణకు గురవుతున్నాయని ఫిర్యాదుల వస్తుండడంతో నిఘా పెంచినట్లు బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.
(దేవరకొండ ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.
ఆర్డీవో : ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూములను గుర్తించి ఇప్పటికే కంచె ఏర్పాటు చేశాం. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.
ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ గురుకులాల్ల విద్యార్థుల అస్వస్థతకు కారణాలేంటి?
ఆర్డీవో : విద్యార్థుల అస్వస్థతకు జ్వరం, అనారోగ్యమే కారణం. గురుకులాలు, హాస్టళ్లను తనిఖీలు చేపడుతున్నాం .
ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారు ల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైందా?
ఆర్డీవో: ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కసరత్తు జరుగుతుంది. అర్హులైన లబ్ధిదారులను నిబంధనల మేరకు గుర్తిస్తాం.
ఆంధ్రజ్యోతి: భూనిర్వాసితుల పరిస్థితి ఏమిటి?
ఆర్డీవో: డిండి, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులందరికీ ప్రభుత్వం భూప రిహారం, పునరావాసం కల్పిస్తున్నది. నక్కల గండి రిజర్వాయర్ కింద భూములు, ఇళ్లు కోల్పో తున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించే చర్యలు కొనసాగుతున్నాయి. నిర్వాసితు లంద రికీ న్యాయం జరుగుతుంది.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

హాలియా, డిసెంబర్ 11: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి బుధవారం హాలియాలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో కేజీబీవీ పాఠశాలలో సిబ్బంది లేక పేద, మధ్య తరగతి విద్యార్థుల చదు వులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అలాగే గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టల్‌లలో సరఫరా చేస్తున్న బియ్యంలో అక్కడక్కడ నాణ్యత లోపిస్తుందని దాంట్లో అధికారులు చొరవ చూపాలని కోరారు. మెనూ పాటించడంలో కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అలాంటి వారిని గుర్తించి సస్పెండ్ చేయా లని వినతిలో కోరారు. వినతి సమర్పించిన వారిలో ఎస్ఎఫ్ఐ నల్లగొండ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, కోరే రమేష్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొండమల్లేపల్లి, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం దమ్మాయిగూడలో బీ.ఆర్. అంబేడ్కర్ విగ్రహం పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న, జిల్లా రాములు, ధర్మపురం శ్రీను, ఆడెపు శ్రీను, మేదరి ప్రసాద్, కం దుల చంటి, వస్కుల అనిల్ తదితరులున్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్ డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రా మాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల ంలోని చిల్లాపురం గ్రామంలో బుధ వారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మ తాలకు అతీతంగా నేతందరిని కలుపుకుని అన్ని గ్రామాల్లో అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. అభివృద్ధి కమిటీ వార్డుల్లో పర్యటించి చేపట్టాల్సిన పనులు, అభివృద్ధి కార్యక్రమాల జాబితాను రూపొందించాలని సూచించారు. గ్రామ అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, మంచినీటి సర ఫరా, విద్యుత్ కొరతను నివారించే విధంగా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బసవయ్య, లక్ష్మీనా రాయణ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

గణిత టాలెంట్ టెస్టులో ప్రతిభ

త్రిపురారం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామానుజన్ జయంతి సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టులో మండలంలోని చెన్నాయి పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇంగ్లిష్ మీడియం విభా గంలో ద్వీజ, బాలాజీ, పెద్దదేవులపల్లి ఉన్నత పాఠ శాల విద్యార్థి జ్యోతి, తెలుగు మీడియం విభా గంలో త్రిపురారం ఉన్నత పాఠశాల విద్యా ర్థులు కొటేష్, శ్రావణి, కుమారి మండ ల స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో బుధవారం అభిన దించారు. కార్యక్రమంలో హెచ్ఎం సైదిరెడ్డి, రవికుమార్, నరసింహస్వామి, వెంక టేశ్వర్లు, వీరారెడ్డి, సైదులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు అడ్డగింత

నాంపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మం డలం లోని ముష్టి పల్లి గ్రామం నుంచి మట్టిని అక్రమంగా తరలి స్తున్నారని గ్రామస్తులు టిప్పర్‌ను అడ్డుకొని బుధవారం నిరసన వ్యక్తం చేశా రు. గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 136లో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నాంపల్లి నుంచి కొండ మల్లేపల్లి వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులకు మట్టిని తరలిస్తు న్నారని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు మట్టిని తరలింపును నిషేధించాలని గ్రామస్తులు వినతిపత్రం అంద జేశారు. ఈ విషయమై తహసీల్దార్ దేవసింగ్‌ను వివరణ కోరగా మట్టి తవ్వకాల కోసం ఎవరు అనుమతి తీసుకోలేదని తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో కుందారపు సాయన్న, గుండు నాగేంద్రబాబు, మల్లయ్య, గోరంటి, వెంకటయ్య, ఆదిరాల విష్ణు, నల్లగంటి ఈదయ్య, ఆదిరాల పరమేష్, గుండు వెంకటయ్య ముష్టిపల్లి లింగస్వామి, నల్లగం తుల భీమయ్య, రాజు పాల్గొన్నారు.



వాహనాలను అడ్డుకుంటున్న ముష్టిపల్లి గ్రామస్తులు

బ్యాడ్మింటన్ పోటీల్లో క్లియో స్పోర్ట్స్ అకాడమీ సత్తా

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మిర్యాల గూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు బ్యాడ్మిం టన్ పోటీల్లో సత్తాచాటినట్లు ఎండీ రాహుల్ నేతి తెలిపారు. బుధవారం స్టేడియంలో మాట్లా డుతూ హైదరాబాద్‌లో నిర్వహిం చిన అండర్- 11, 13, 15 ఓపెన్ కేటగిరీ పోటీల్లో డబుల్స్ విభా గంలో పట్టణ క్రీడాకారులు దీపక్‌నా యుడు, ఆకుల రాంచ రణ్ బంగారు పతకం సాధించా రన్నారు. అదే పోటీల్లో సింగిల్స్ విభాగంలో బాణాల రియాన్స్ రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. అండర్-13 విభా గంలో అక్షిత్‌రెడ్డి, సాయిచరణ్ శ్యామల డబుల్స్ విభాగంలో రజత పతకం సాధించారన్నారు. ఇండియన్ ప్లేయర్ ప్రియాంశ రాజావత్ పత కాలు అందుకున్న క్రీడాకారులను కోచ్ మారబోయిన రామకృష్ణ, హర్ష ఏచూరి అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అకాడమీ నిర్వాహకులు

మైక్రోఫైనాన్స్ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలి



శ్రీనివాస శర్మకు వినతిపత్రం అందజేస్తున్న అవంతీపురం గ్రామస్తులు

మిర్యాలగూడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రికవరీ పేర జులూం చేస్తున్న మైక్రోఫైనాన్స్ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో అవంతీపురం గ్రామస్తులు బుధ వారం సబ్‌కలెక్టరేట్‌లో కార్యాలయ అధికారి శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ ద్వారా అప్పు పొందిన యువతీ, యువకుల వద్ద అధిక వడ్డీలు వసూలు చేస్తూ అర్ధరాత్రి ఇళ్లలోకి వచ్చి వేధిస్తున్నారని అన్నారు. అప్పటికప్పుడు బకాయిలు చెల్లించకపోతే ఏదైనా వస్తువులను పట్టుకపోతామని బెదిరిస్తున్నారని అన్నారు. సబ్‌కలెక్టర్ స్పందించి సదరు ఫైనాన్స్ ఏజె ంట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో సయ్యద్ మోసిన్, రాంబాబు, గణేష్, రవి తదితరులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్



పెద్దవూర: క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు.



పీఏపల్లి : పోటీలను ప్రారంభిస్తున్న చర్చి పాస్టర్ మత్తయ్య, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు

దామరచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి క్రీడా నైపుణ్యాలు కలిగిన క్రీడాకారులను గుర్తించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు దోహదపడుతాయని తహసీల్దార్ జవహర్‌లాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఎం కప్ కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే విధంగా కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబరిచి మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, ప్రధానోపాధ్యాయులు బండా వెంకట్‌రెడ్డి, కోల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగలక్ష్మి, రాంరెడ్డి, షమీంఅక్తర్, రాము, సతీష్, నాగేశ్వర్‌రావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

● పెద్దవూర : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను తహసీల్దార్ సరోజ, ఎంపీడీవో ఉమాదేవి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో మొత్తం 150 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ చాటిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో తరి రాము, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ విమల, పీడీ శివరాం, శోభారాణి, లెనిన్, మురళి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : క్రిస్మస్ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, చర్చి పాస్టర్ ముత్తయ్య బుధ వారం ప్రారంభించారు. గెలుపు ఓటమితో సంబంధం లేకుండా స్నేహ పూర్వకంగా పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు సూచించారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 28 బృందాలు హాజరైనట్లు ఆర్గనైజర్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు ఇస్తామని ఆర్గనైజర్లు తెలిపారు. వీరమళ్ల పరమేశ్, వడ్లపల్లి శేఖర్‌రెడ్డి, గండు దయాకర్, డీలర్ శ్రీనునాయక్, రమావత్ దామోదర్, కళ్యాణ్‌కుమార్, తూటిపల్లి నగేష్, సన్నీ, శ్రీకాంత్ ,ప్రశాంత్,సంజయ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న లింగంగౌడ్

లింగంగౌడ్‌కు గీతా పురస్కారం

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం నాయకుడు జాజుల లింగంగౌడ్ గీతా పురస్కారం అందుకున్నారు. బీసీల హక్కుల సాధన కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్న లింగంగౌడ్ సేవలను గుర్తించిన తెలుగు భాషా చైతన్యసమితి గీతా జయంతి పురస్కారానికి ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని చిక్కడ పల్లి త్యాగరాయభవన్‌లో నిర్వహిచిన కార్యక్రమంలో వనపర్తి అడిషనల్ ఎస్పీ తేజావత్ రాందాస్‌నాయక్ పుర స్కారం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నక్క శ్రీనివాస్, రాధ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

కొండమల్లేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి కేజీబీవీ పాఠశాలలో బుధవారం డిక్షనరీ, స్టడీ మెటీరియల్ అంద జేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొ న్న ఎంఈవో నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కస్తూరి ఫౌండే షన్ సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్రీ చరణ్, సభ్యులు మహేష్, నవీన్ రెడ్డి, నరేందర్, జహంగీర్, ఏరుకొండ రాము, జితేందర్ యాదవ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కా గా చేపట్టడంతో పాటు యాప్‌లో వివరాల నమో దులో తప్పిదాలకు తా విహ్వద్దని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. బుధ వారం మండలంలోని అక్కంపల్లి గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సిగ్నల్ అంత రాయం ఏర్పడడం, లాగిన్ కాకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నెమ్మదిగా కొన సాగుతుంది. దరఖాస్తు దారులు సిబ్బం దికి ఇంటి స్థలం డాక్యుమెంట్, ఆధార్ కార్డు, విద్యుత్‌బిల్లు అందించి సహకరించాలని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు,



సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

మహిళా కబడ్డీ పోటీల్లో నల్లగొండ జట్టు హ్యాట్రిక్

హాలియా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు హ్యాట్రిక్ సాధించి కబడ్డీ చరిత్రలో సంచలనం సృష్టించిందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. భూలోక రావు, జి.కర్తయ్య బుధ వారం తెలిపారు. రాష్ట్ర కబడ్డీ చరిత్రలో 20 ఏళ్లలో 14 సార్లు ఛాంపియన్ షిప్ సాధించి అగ్రగామిగా జిల్లా జట్టు వెలుగొ ందు తుందన్నారు. జిల్లా క్రీడాకారిణులు సబ్ జూనియర్, సీనియర్ మహిళలు జాతీయ కబడ్డీ పోటీల్లో పాల్గొనడం విశేష మన్నారు. ప్రస్తుత ఛాంపియన్ షిప్ సాధించిన జట్టుకు ఎండీ అన్వర్‌ఖాన్ కోచ్‌గా వ్యవహరి ంచారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాసాని వీరేశం, మహేందర్‌రెడ్డి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.



హ్యాట్రిక్ సాధించిన నల్లగొండ జిల్లా జట్టు

సమాచారం

నేడు వివిధ పార్టీల నాయకులతో సమావేశం

చింతపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చింతపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సుజాత బుధవారం తెలిపారు. నాయకులు తమ అభ్యంతరాలను తెలుపాలని ఆమె సూచించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

దేవరకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబి రాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ దేవర కొం డ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యశోద దవాఖానా వైద్య నిపుణులతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబి రం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

‘ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం’

కొండమల్లేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎస్సీ జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్ ఏకసభ్య కమిషన్ డాక్టర్ షమీమ్ వినతిపత్రం అందజేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అందజేశారు. వర్గీకరణ పేరుతో ఎస్సీ మధ్య చిచ్చు పెట్టొదని కోరారు.

టీచర్ల పెండింగ్ బకాయిలను చెల్లించాలి

మర్రిగూడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బ కాయిలను చెల్లించాలని, డీఏలను మంజూరు చేయాలని ట్రైబల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదావత్ లచ్చిరాం, జాయింట్ సెక్రటరీ సబావత్ వెంకట్‌కుమార్ నాయక్, జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోనిసంఘం సభ్యత్వ నమోదును వారు ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. మండల అధ్యక్షుడు రమావత్ విఠల్, ప్రధాన కార్యదర్శి నేనావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, తిరుపతయ్య, లక్‌పతి, ప్రియాంక పాల్గొన్నారు.